# జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

జన శ్రేయస్సే మా బాధ్యత

సంపుటి : 02 సంచిక : 02, ఎడిటర్: మార్పు సాయి కుమార్ పేజీలు : 08, వెల రూ. 5రూ/ గురువారం -01 - మే - 2025

Published From, Guntur : Circulatedat,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna,Kurnool ,Srikakulam, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad




విలేకరులు కావలెను

ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా నడపబడుతున్న జనం రిపోర్టర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను. అంకిత భావంతో పనిచేసేందుకు ఆసక్తి గలవారు

సంప్రదించండి: 9398 15 6948


## ప్రధాని అధ్యక్షతన 'సూపర్ క్యాబినెట్' భేటీ..

### పుల్వామా ఘటన తర్వాత తొలిసారి



- 2019 ఫిబ్రవరిలో సూపర్ కేబినెట్ భేటీ
- ఈ సమావేశం తర్వాతే పాకిస్థాన్‌పై సర్జికల్ స్ట్రైక్స్
- తాజాగా సమావేశం నేపథ్యంలో సర్వత్ర ఉత్కంఠ

ఢిల్లీ: పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి తో భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ ఘటనకు భారత్ తగిన సమాధానం ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో బుధవారం ప్రధాని నరేంద్రమోదీ పలు కీలక సమావేశాలకు అధ్యక్షత వహిస్తున్నారు. దేశ భద్రతపై అత్యున్నత నిర్ణయాలు తీసుకొనే క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ రెండోసారి సమావేశమైంది. అనంతరం రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ భేటీ జరిగింది. క్యాబినెట్ సమావేశం కూడా నిర్వహించనున్నారు.

### సూపర్ క్యాబినెట్..

సీసీపీఏ అనేది అత్యంత శక్తివంతమైన గ్రూప్. దానిని 'సూపర్ క్యాబినెట్' అని కూడా పిలుస్తారు. 2019లో జరిగిన పుల్వామా ఉగ్రదాడి అనంతర పరిణామాల నేపథ్యంలో నాడు సీసీపీఏ భేటీ అయింది. ఆ తర్వాత ఈ క్యాబినెట్ మిగతా..2లో

## తెలంగాణ టెన్త్ ఫలితాలను విడుదల చేసిన సీఎం రేవంత్‌రెడ్డి



- ఒక్క విద్యార్థీ పాస్‌కాని స్కూళ్లు రెండు.. జూన్ 3 నుంచి 'పది' సప్లిమెంటరీ పరీక్షలు
- తెలంగాణ టెన్త్ ఫలితాల్లో 92.78 శాతం ఉత్తీర్ణత నమోదైంది.
- తెలంగాణ టెన్త్ ఫలితాల కోసం క్లిక్ చేయండి

హైదరాబాద్: తెలంగాణ టెన్త్ ఫలితాలను సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులతో కలిసి సీఎం విడుదల చేశారు. ఫలితాల్లో 92.78 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గతేడాది కంటే ఈసారి 1.47 శాతం అధికంగా ఉత్తీర్ణత నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ ఫలితాల్లోనూ బాలికలే పైచేయి సాధించారు. 94.26 శాతం మంది బాలికలు ఉత్తీర్ణత కాగా.. 91.32 శాతం మంది బాలురు పాసయ్యారు. అత్యధికంగా గురుకుల పాఠశాలల్లో 98.7 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. ప్రైవేటు పాఠశాలల్లో మిగతా..2లో

## భూదాన్ భూముల కేసులో తెలంగాణ హైకోర్టులో ఐపీఎస్ లకు చుక్కెదురు



- సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు డివిజన్ బెంచ్ నిరాకరణ
- ఐపీఎస్ అధికారుల తరపు వాదనలను తోసిపుచ్చిన ధర్మాసనం

హైదరాబాద్: భూదాన్ భూముల కేసుకు సంబంధించి సీనియర్ ఐపీఎస్ అధికారులు మహేశ్ భగవత్, స్వాతి లక్రా, సౌమ్య మిశ్రాలకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించలేదు. ఈ వివాదంలో హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించాలని కోరుతూ వారు దాఖలు చేసిన పిటిషన్‌ను డివిజన్ బెంచ్ తోసిపుచ్చింది. తదుపరి వాదనలను మిగతా..2లో



2లో

## దేవినేని కుమారుడి వివాహం..

### హాజరైన తెలంగాణ సీఎం, మంత్రి లోకేశ్, ప్రముఖులు

తెలంగాణ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి విజయవాడకు సీఎం రేవంత్



2లో

## భారత్‌ను వీడిన 786 మంది పాకిస్థానీలు.. పాక్ నుంచి 1,376 మంది భారతీయుల రాక

- పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత పాక్‌పై భారత్ కఠిన చర్యలు
- భారత్ నుంచి పాకిస్థానీలను వెళ్లగొడుతున్న వైనం
- 27 లోపు పాకిస్థానీలందరూ భారత్ నుంచి వెళ్లిపోవాలని ఆదేశం
- 6 రోజుల్లో అట్టారి-వాఘా సరిహద్దు ద్వారా భారత్‌ను వీడిన 786 మంది పాక్ పౌరులు

## గోడ కూలుతుందని ఎవరూ అనుకోలేదు... బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం: అనిత



- సింహాచలం ఆలయం వద్ద గోడకూలి ఏడుగురి మృతి
- తాము దర్శనం చేసుకుని వచ్చాక గోడ కూలిన ప్రమాదం గురించి తెలిసిందన్న అనిత
- అర్ధరాత్రి వర్షం పడుతున్న సమయంలో కూడా తాము ఇక్కడే ఉన్నామని వెల్లడి
- మరణించిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా
- ప్రమాదంలో గాయపడిన వారికి రూ. 3 లక్షల చొప్పున ఆర్థిక సహాయం

## ఈ సందేహాలు తీర్చండి.. టీఎస్పీఎస్సీకి కేంద్ర మంత్రి లేఖ



- గ్రూప్-1 అక్రమాలపై రంగంలోకి బండి సంజయ్
- భారీ ఎత్తున అవినీతి, అక్రమాలు, తప్పిదాలు జరిగాయని అభ్యర్థుల ఆందోళన
- జోక్యం చేసుకోవాలని కేంద్ర మంత్రికి వినతుల వెల్లువ
- అభ్యర్థుల ఆందోళనను పరిగణలోకి తీసుకున్న బండి సంజయ్
- టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశంకు స్వయంగా లేఖ రాసిన కేంద్ర మంత్రి

న్యూఢిల్లీ: తెలంగాణ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో అక్రమాలు, అవినీతి ఆరోపణలతోపాటు తీవ్రమైన తప్పిదాలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తుతుండటంతో కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రంగంలోకి దిగారు. గ్రూప్ 1 పరీక్షా ఫలితాలపై టీజీపీఎస్సీ నుండి సమాచారం కోరుతూ.. టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశంకు ఆయన లేఖ రాశారు. అభ్యర్థుల నుంచి పెద్ద ఎత్తున తనకు విజ్ఞప్తులు మిగతా..2లో



2

## సింహాచలం దుర్ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి.. మృతుల కుటుంబాలకు పరిహారం ప్రకటన

- సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి చందనోత్సవంలో అపశ్రుతి
- మృతుల కుటుంబాలకు ప్రధాని మోదీ ప్రగాఢ సానుభూతి
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు చొప్పున పరిహారం ప్రకటన

## తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయ్యిందా?

### ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదు



- కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ కోతుల గుంపునకు అప్పగించినట్లయింది
- మరో పదేళ్లు దోచుకోవడం ఆగిందని తెలంగాణ ఆగమైందా?
- కాళేశ్వరం, రైతు రుణమాఫీ, ఎస్సీ వర్గీకరణ, కులగణన, రైతుబంధుపై చర్చిద్దామా?
- ప్రభుత్వ నిర్ణయాల్లో ఎక్కడా మంచి కనబడట్లేదా?
- ఫాంహౌస్‌కే పరిమితం కాకుండా ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి
- కేసీఆర్‌పై సీఎం రేవంత్ ఫైర్

హైదరాబాద్: ఇటీవల ఎల్కతుర్తిలో జరిగిన భారాస రజతోత్సవ సభకు తాము సంపూర్ణంగా సహకరించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రవీంద్రభారతిలో నిర్వహించిన బసవేశ్వర 892 జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాలను విడుదల చేసిన అనంతరం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. భారాస రజతోత్సవ వేడుకల్లో మాజీ సీఎం కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన విమర్శలకు కౌంటర్ ఇచ్చారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ కోతుల గుంపునకు అప్పగించినట్ల యిందంటూ సీఎం ధ్వజమెత్తారు. ప్రతిపక్ష నేత కుటుంబం తెలంగాణ మీద పడి దోచుకుందన్నారు. 'తెలంగాణ ఆగమైంది.. కాంగ్రెస్ విలన్' అంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై సీఎం తీవ్రంగా మండిపడ్డారు. మరో పదేళ్లు దోచుకోవడం ఆగిందని తెలంగాణ ఆగమైందా? తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయ్యిందా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం, రైతు రుణమాఫీ, ఎస్సీ వర్గీకరణ, కులగణన, రైతుబంధుపై మిగతా..2లో



2

## పీవోకేను స్వాధీనం చేసుకోవడమే పరిష్కారం.. భారత్‌కు బ్రిటిష్ ఎంపీ సూచన

పాక్ చెత్త పనిపై సమాధానం దాటేసిన అమెరికా..!

ఉగ్రవాద నిర్మూలనలో భారత్‌కు సహకరిస్తాం: బ్రిటన్

## పాక్ కు విడిచే బదులు మాకు తాగు నీళ్లివ్వండి.. పంజాబ్ కు హర్యానా సీఎం విజ్ఞప్తి

- తాగునీటిపై ఇరు రాష్ట్రాల మధ్య ముదురుతున్న వివాదం
- భాక్రా నంగల్ ప్రాజెక్టు నుంచి నీరివ్వాలని సైనీ డిమాండ్
- డ్యామ్ ఖాళీ చేయకపోతే నీరు పాకిస్థాన్ కు వెళ్తుందని హెచ్చరిక
- హర్యానా వాదనలను ఖండించిన పంజాబ్ సీఎం భగవంత్ మాన్

పంజాబ్ : హర్యానా, పంజాబ్ రాష్ట్రాల మధ్య నీటి పంపకాల వివాదం మరోసారి తీవ్రస్థాయికి చేరింది. తమ రాష్ట్రానికి తాగునీటిని విడుదల చేయాలని, లేదంటే భాక్రా డ్యామ్‌లోని



అదనపు జలాలు పాకిస్థాన్ కు పోతాయని హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ పంజాబ్‌ను హెచ్చరించారు. వర్షాకాలంలో నీటిని నిల్వ చేసుకునేందుకు వీలుగా జూన్ లోపు భాక్రా జలాశయాన్ని ఖాళీ చేయాలని ఆయన నొక్కి చెప్పారు. "జలాశయంలో నీటిని నిల్వ చేయడానికి మిగతా..2లో

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక



## ప్రధాని అధ్యక్షతన'సూపర్ క్యాబినెట్' భేటీ..

మొదటి పేజి తరువాయి




ఆ తర్వాత ఈ క్యాబినెట్ కమిటీ మళ్లీ సమావేశం కావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. 2019లో పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ వాహనంపై జరిగిన దాడిలో 40 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దానిపై దేశంలో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఈ దారుణ ఘటనపై ప్రతీకార చర్యలు, పరిస్థితిని సమీక్షించేందుకు ఆనాడు సీసీపీఏ సమావేశమైంది. ఆ సమావేశంలోనే పాకిస్థాన్‌కు ఉన్న 'అత్యంత అనుకూల దేశం' వాణిజ్య హోదాను రద్దు చేయాలని భారత్ నిర్ణయించింది. ఆ ఏడాదిలో కొన్ని రోజుల తర్వాత, ఫిబ్రవరి 26న భారత వైమానిక దళం బాలాకోట్‌లోని ఉగ్రవాద శిబిరాలపై వైమానిక దాడి చేసి, దాయాదికి గట్టి సమాధానం ఇచ్చింది. అత్యంత కీలక సందర్భాల్లో మాత్రమే సీసీపీఏ సమావేశం అవుతుంది. దేశంలోని ముఖ్యమైన రాజకీయ, ఆర్థిక విషయాలను సమీక్షించి నిర్ణయాలు తీసుకుంటుంది. రాజకీయ చిక్కులు కలిగి ఉన్న ఆర్థిక విధానాలు, అంతర్గత భద్రతా సమస్యలపై చర్చలు, నిర్ణయాలు ఉంటాయి. వివిధ మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయానికి సహాయపడుతుంది. దేశ రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్న అంశాలను ఈ భేటీలో చర్చిస్తారు. ప్రధాని మోదీ అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్‌షా, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తదితరులు పాల్గొన్నట్లు తెలుస్తోంది.

## భారత్‌ను వీడిన 786 మంది పాకిస్థానీలు..
## పాక్ నుంచి 1,376 మంది భారతీయుల రాక

ఢిల్లీ: పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత దాయాది పాకిస్థాన్‌పై భారత ప్రభుత్వం కఠిన చర్యలకు దిగిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా భారత్‌లో ఉన్న పాకిస్థానీలను దేశం విడిచిపెట్టి వెళ్లాలని ఈ నెల 24న భారత విదేశాంగ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఏప్రిల్ 27 వరకు పాకిస్థానీలందరూ భారత్ నుంచి వెళ్లిపోవాలని తెలిపింది. అలాగే మెడికల్ వీసాపై ఉన్నవారికి 29 వరకు గడువు ఇచ్చింది. దీంతో ఏప్రిల్ 24 నుంచి ఆరు రోజుల్లో పంజాబ్‌లోని అటారీ- వాఘా పాయింట్ ద్వారా 786 మంది పాకిస్థానీయులు స్వదేశానికి వెళ్లిపోయినట్లు ఒక సీనియర్ అధికారి తెలిపారు. అదే సమయంలో 1,376 మంది భారతీయులు పాకిస్థాన్ నుంచి అట్టారి-వాఘా సరిహద్దు ద్వారా తిరిగి వచ్చారని అధికారి తెలియజేశారు. ఇక, 12 క్యాటగిరీల కింద స్వల్ప కాల వ్యవధి వీసాదారులు ఈ నెల 27లోగా దేశం వదిలి వెళ్లిపోవాలని భారత్ ఆదేశించింది. సార్క్ వీసా కలిగి ఉన్న వారికి ఏప్రిల్ 26, మెడికల్ వీసాలు ఉన్న వారికి ఏప్రిల్ 29 డెడ్‌లైన్‌గా విధించిన విషయం తెలిసిందే. ఒకవేళ ప్రభుత్వ ఆదేశాలు ధిక్కరించి, ప్రభుత్వం విధించిన గడువులోగా భారత్ విడిచి వెళ్లని పాకిస్థానీయులను అధికారులు అదుపులోకి తీసుకోవడం జరుగుతోంది. వారికి మూడేళ్ల జైలు శిక్ష, లేదా 3 లక్షల జరిమానా లేక రెండు శిక్షలూ విధించే అవకాశం ఉంది. కాగా, ప్రస్తుతం ఇరుదేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితుల దృష్ట్యా పాకిస్థాన్ కు ప్రయాణించవద్దని భారత పౌరులకు కేంద్ర ప్రభుత్వం సూచించింది. ప్రస్తుతం పాకిస్థాన్ లో ఉన్న భారతీయ పౌరులు కూడా వీలైనంత త్వరగా స్వదేశానికి తిరిగి రావాలని తెలిపింది.

## తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయ్యిందా?

మొదటి పేజి తరువాయి



కాళేశ్వరం, రైతు రుణమాఫీ, ఎస్సీ వర్గీకరణ, కులగణన, రైతుబంధుపై చర్చిద్దామా? అంటూ ఈ సందర్భంగా సవాల్ విసిరారు. ప్రతిపక్ష హోదా ఇచ్చిన ప్రజల వద్దకు కేసీఆర్ ఎందుకు వెళ్లట్లేదని ప్రశ్నించారు.

ప్రభుత్వ నిర్ణయాల్లో ఎక్కడా మంచి కనబడట్లేదా?

"బీఆర్ఎస్ సభ ఏర్పాటు చేసుకుంటే బస్సులు ఇవ్వాలని చెప్పాం. సభకు అవసరమైన వెసులుబాటుకల్పించాలని అధికారులను ఆదేశించాం. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వంతో పాటు ప్రతిపక్షం బలంగా ఉండాలి. బీఆర్ఎస్ సభకు మేం సంపూర్ణంగా సహకరించింది నిజం కాదా? ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయంలో ఎక్కడా మంచి కనబడటం లేదా? ప్రభుత్వాన్ని భుజం తడుతూ వైఫల్యాలను ప్రశ్నించాలి. మా వైఫల్యాలపై ఎండగట్టాలి.. కానీ, ప్రతిపక్ష నేత ఇంట్లో నుంచి బయటకు వెళ్లకుండా ప్రభుత్వ వసతులు అనుభవిస్తున్నారు. 16 నెలలుగా జీత భత్యాలు తీసుకొని ఫాంహౌస్‌లోనే ఎందుకు ఉంటున్నారు?

ఇవేవీ కనబడటం లేదా?

అసెంబ్లీకి రాను.. మా పిల్లల్ని పంపామని చెబుతున్నారు. పిల్లలను సభకు పంపితే మీరెందుకు ప్రతిపక్ష నేతగా ఉన్నారు? సభకు రాని ప్రతిపక్ష నేతకు మమ్మల్ని ప్రశ్నించే నైతిక హక్కు ఉందా? ప్రతిపక్ష హోదా ఇచ్చిన ప్రజల వద్దకు ఎందుకు వెళ్లడంలేదు. అధికారం ఉంటే చెలాయిస్తాం. లేకపోతే ఫాం హౌస్‌లో ఉంటామంటున్నారు. గత ప్రభుత్వ పథకాలు నిలిపివేసినట్లు చెబుతున్నారు. మీరు హయాంలోని పథకాలు ఏం ఆగిపోయాయి? రైతుబంధు ఆగిందా?, షాదీముబారక్, కళ్యాణలక్ష్మీ, ఫీజురియంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్ ఆగాయా? రాష్ట్రంలో ప్రజా పాలన ఎక్కడైనా ఆగిందా? మేం సన్నబియ్యం ఇస్తున్నాం. పేదల ఇళ్లకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, 60వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. రెండున్నర లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం. ప్రైవేటులో లక్ష ఉద్యోగాలు కల్పించాం. హైదరాబాద్‌ను విస్తరించేందుకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. ఇవేమీ మీకు కనడటంలేదా?. కడుపు నిండా విషం నింపుకొని విద్వేషపూరిత ప్రసంగంతో ప్రజల మధ్య చిచ్చుపెట్టాలనే ప్రయత్నం మంచిదికాదు" అన్నారు.

## గోడ కూలుతుందని ఎవరూ అనుకోలేదు... బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం: అనిత

అమరావతి: సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి చందనోత్సవం సందర్భంగా తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆలయ ప్రాంగణంలో గోడ కూలిన దుర్ఘటనలో ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. హోంమంత్రి వంగలపూడి అనిత స్వయంగా సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించడంతో పాటు మృతుల కుటుంబాలకు భారీ పరిహారాన్ని ప్రకటించారు. సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ దురదృష్టకర సంఘటనలో ఏడుగురు మరణించారని, వారిలో నలుగురు పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నారని ఆమె తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. చందనోత్సవానికి భక్తులు భారీ సంఖ్యలో వస్తారని ముందుగానే అంచనా వేసి, అందుకు తగిన ఏర్పాట్లు చేశామని, తాను కూడా రెండు రోజుల క్రితం ఏర్పాట్లను పరిశీలించానని అనిత చెప్పారు. "ఇది ఊహించని ఘటన. గోడ కూలుతుందని ఎవరూ ఊహించలేరు. అర్ధరాత్రి వర్షం పడుతున్న సమయంలో మేం కూడా ఇక్కడే ఉన్నాం, దర్శనం చేసుకుని బయటకు వచ్చాక ప్రమాదం గురించి తెలిసింది. వెంటనే ఇక్కడికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నాం. సహాయక చర్యల్లో ఎలాంటి జాప్యం జరగలేదు" అని తెలిపారు. గోడ కూలిన ఘటనకు దారితీసిన కారణాలపై సమగ్ర విచారణ జరుపుతామని హోంమంత్రి స్పష్టం చేశారు. కూలిన గోడ నిర్మాణం ఎప్పుడు జరిగింది? కాంట్రాక్టర్ ఎవరు? నిర్మాణంలో నాణ్యతా లోపాలున్నాయా? అనే కోణాల్లో దర్యాప్తు ఉంటుందన్నారు. ఈ ఘటనను ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని, విచారణలో బాధ్యులుగా తేలిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. మరోవైపు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింహాచలం ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. గోడ కూలిన ఘటనపై లోతైన విచారణ జరిపేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మరణించిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన వారికి రూ. 3 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ఆదేశించారు. అంతేకాకుండా, బాధితుల కుటుంబాల్లో అర్హులైన వారికి దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగావకాశాలు కల్పించాలని సీఎం చంద్రబాబు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం బాధితులకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

## ఈ సందేహాలు తీర్చండి.. టీఎస్పీఎస్సీకి కేంద్ర మంత్రి లేఖ

మొదటి పేజి తరువాయి



అభ్యర్థుల నుంచి పెద్ద ఎత్తున తనకు విజ్ఞప్తులు వెల్లువెత్తడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణ, మూల్యాంకన విధానం, ఫలితాల విషయంలో అనేక అక్రమాలు, అవకతవకలు, తప్పిదాలు జరిగాయని, నిబంధనల ఉల్లంఘన జరిగిందని పేర్కొంటూ గ్రూప్ 1 అభ్యర్థులు పలుమార్లు తన దృష్టికి తీసుకొచ్చిన నేపథ్యంలో.. ఆ అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత టీఎస్‌పీఎస్సీ పైన ఉందని ఆయన లేఖలో పేర్కొన్నారు. ప్రధానంగా మార్కుల ప్రకటన, నోటిఫికేషన్ ఉల్లంఘన, పరీక్షా పత్రాల మూల్యాంకనంలో జరిగిన పొరపాట్లతోపాటు ఉర్దూ మీడియంలో రాసిన అభ్యర్థులకు టాప్ ర్యాంకులు రావడాన్ని ఆ లేఖలో ప్రస్తావించారు. వీటికి సంబంధించి సమగ్ర సమాచారాన్ని వారం రోజుల్లో పంపాలని ఛైర్మన్ ను కేంద్ర మంత్రి బండి సంజయ్ కోరారు. మరోవైపు హైకోర్టులో గ్రూప్ 1 కేసు విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో.. టీజీపీఎస్సీ నుండి వచ్చిన సమాచారం ఆధారంగా అవసరమైతే తాను సైతం కేసులో ఇంప్లీడ్ కావాలని ఆయన నిర్ణయించారు.

బండి సంజయ్ లేఖలో కోరిన అంశాలు

1. మార్కుల ప్రకటన:UPSC తరహాలో ఎంపికైన మొత్తం 563 మంది అభ్యర్థుల పూర్తి మార్కుల జాబితాను(పేర్లతోసహా) అందించగలరు. రీకౌంటింగ్ కు ముందునాటి జనరల్ ర్యాంకింగ్ జాబితా మరియు ప్రొవిజనల్ మార్కుల జాబితా అందించగలరు. అట్లాగే నోటిఫికేషన్ యొక్క 15.2 - 15.3 నిబంధనలు ఉల్లంఘనకు కారణాలను వివరించగలరు. అభ్యర్థులకు వచ్చిన మార్కుల జాబితాను మీడియం వారీగా అందించగలరు. ప్రిలిమ్స్ - మెయిన్స్ హాల్ టికెట్ నంబర్లు, పేరు, వయస్సు, మీడియం, లింగం, కేటగిరీ, ప్రతి పేపర్‌కు సంబంధించిన మార్కులు మరియు మొత్తం మార్కులతో సహా తెలియజేయగలరు.

2. మూల్యాంకన ప్రక్రియ:

గ్రూప్ 1 పరీక్షల మూల్యాంకనానికి సంబంధించి మొత్తం దశల సంఖ్య, ప్రతి దశలో Evaluation జరిగిన రోజుల సంఖ్య, కేంద్రాలు లేదా పేపర్ వారీగా సమాచారం తెలియజేయగలరు. ప్రతిరోజు మూల్యాంకనకు ఉపయోగించిన గంటలు, మూల్యాంకనకారులకు ఇచ్చిన, మారిన సూచనలను తెలియజేయగలరు.

? పదవీ విరమణ పొందిన మూల్యాంకనకారులను ఎంపిక చేసిన ప్రమాణాలు ఏమిటి? బ్లూప్రింట్లు మీడియం స్పెసిఫిక్‌గా ఉన్నాయా లేక కేవలం ఇంగ్లీషులో మాత్రమేనా? ప్రతి పేపర్, ప్రతి మీడియంకు ప్రతి దశలో ఎంత మంది మూల్యాంకనకారులు ఉన్నారు? మూల్యాంకన సమయంలో ఉన్న సీసీ టీవి ఫుటేజ్ భద్రత స్థితి ఏమిటి? గౌరవనీయ సుప్రీం కోర్టు ఆదేశించినట్లుగా UPSC స్థాయిలో మోడరేషన్ ప్రక్రియను పాటించకపోవడానికి కారణాలను తెలియజేయగలరు.

3. హాజరు వివరాలు:

జనరల్ ఇంగ్లీష్ మరియు పేపర్లు 1- 6కి పేపర్ వారీగా, మీడియం వారీగా హాజరు వివరాలను అందించగలరు. ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ హాజరు విధానం పాటించబడిందా లేదా? పాటించకపోతే కారణాలేమిటి? నమోదు అయిన హాజరులో ఉన్న వ్యత్యాసాలకు కారణాలను తెలియజేయగలరు.

4. ఫలితాల ప్రకటనకు ముందు డేటా లీక్:

మార్చి 15, 2025న ఒక టెలిగ్రామ్ గ్రూప్‌లో 450కి పైగా మార్కులు పొందిన అభ్యర్థుల సంఖ్య (618) సోషల్ మీడియాలో పోస్టు చేయబడింది. మార్చి 30న విడుదలైన జీఆర్ఎల్ తో ఇది సమానం. సున్నితమైన డేటా లీక్‌కు బాధ్యులైన వారిపై తీసుకున్న చర్యలను తెలియజేయగలరు.

5. కోడ్ ఆధారిత మార్కుల నకిలీ లక్షణాలు:

0-50 అంకెల తేడా ఉన్న హాల్ టికెట్ నంబర్ల కలిగిన 1,500కు పైగా అభ్యర్థుల జంటలకు ఒక్కటే మార్కులు రావడం, అంకె పదాంశాల వరకు సరిపోలేదని తెలిసింది. ఇది ఒక కోడెడ్ మార్కింగ్ అల్గోరిథం ఉపయోగించారని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. UPSC, APPSC లేదా గత TGPSC పరీక్షలలో ఇలాంటి ధోరణి కనుగొనబడలేదు. దీనికి కారణాలను వివరించగలరు.

6. కేంద్రాల వారీగా అసమాన ఫలితాలు:

కోఠి ఉమెన్స్ కాలేజ్ (సెంటర్లు 18- 19) నుంచి ఎంత మంది మెయిన్స్ పరీక్ష రాశారు. వారిలో ఎంత మందికి టాప్ 500లోపు ర్యాంకులు వచ్చాయి? వివరించగలరు. అట్లాగే మిగిలిన కేంద్రాల నుండి ఎంత మంది పరీక్ష రాశారు? వారిలో ఎంత మందికి టాప్ 500లోపు ర్యాంకులు వచ్చాయి. కోఠి ఉమెన్స్ కాలేజీలో పరీక్ష రాసిన వారికే అత్యధిక ర్యాంకులు వచ్చినట్లు మా దృష్టికి వచ్చింది? దీనిపై సమగ్ర వివరాలను అందించగలరు.

7. అదనపు సమాచారం :

హాల్ టికెట్లు మరియు పరీక్ష కేంద్రాల కేటాయింపు యాదృచ్ఛికంగా జరిగిందా లేక మానవీయంగా కల్పించారా?, UPSC లో హాల్ టికెట్ నంబర్లు స్థిరంగా ఉండగా, ఇక్కడ ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్ వరకు ఎందుకు మార్పు జరిగింది?. పరీక్ష కేంద్రాల వారీగా అభ్యర్థుల కూర్చునే పథకం, పర్యవేక్షణకారుల కేటాయింపు వివరాలు. ? పరీక్ష కేంద్రాల నుంచి వచ్చిన సిసి టివి ఫుటేజ్ భద్రత స్థితి. సమాధాన పత్రాల కోడింగ్ విధానం, మరియు పేరు, జిల్లా కోడ్, పుట్టిన తేదీ వంటి వివరాలను ఎలా నిర్వహించారు?.. తదితర వివరాలను అందించాలని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశంను బండి సంజయ్ లేఖలో కోరారు.

## భూదాన్ భూముల కేసులో తెలంగాణ హైకోర్టులో ఐపీఎస్ లకు చుక్కెదురు

మూడవ పేజి తరువాయి



తదుపరి వాదనలను సింగిల్ బెంచ్ ముందే వినిపించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలోని సర్వే నంబర్లు 181, 182, 194, 195లలో గల భూదాన్ భూములను ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ఇతరులు అక్రమంగా పొందారనే ఆరోపణలు వచ్చాయి. ఈ అక్రమాలపై విచారణ జరపాలని కోరుతూ బిర్ల మల్లేశ్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ సి.వి. భాస్కర్ రెడ్డి నేతృత్వంలోని సింగిల్ బెంచ్ ఏప్రిల్ 24న కీలక ఆదేశాలు జారీ చేసింది. సదరు భూములను ఏప్రిల్ 27 నుంచి నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్, సంబంధిత సబ్ రిజిస్ట్రార్లను ఆదేశించింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఈ ఆదేశాలను సవాలు చేస్తూ మహేశ్ భగవత్, స్వాతి లక్రా, సౌమ్య మిశ్రాలు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై డివిజన్ బెంచ్ విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు తమ వాదనలు వినిపిస్తూ, మహేశ్వరం మండలం నాగారంలోని సర్వే నంబర్ 194లో ఉన్నది పట్టా భూమి అని, భూదాన్ భూమి కాదని కోర్టుకు తెలిపారు. తమ వాదనలను పరిగణనలోకి తీసుకోకుండానే సింగిల్ బెంచ్ ఏకపక్షంగా ఉత్తర్వులు ఇచ్చిందని వారు వాదించారు. పిటిషనర్ కోరిన దానికంటే ఎక్కువ ఉపశమనాన్ని సింగిల్ బెంచ్ కల్పించిందని, పిటిషన్‌ను ఉపసంహరించుకోవద్దని రిజిస్ట్రీని ఆదేశించే అధికారం కూడా సింగిల్ బెంచ్‌కు లేదని వారు పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న హైకోర్టు డివిజన్ బెంచ్, సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ప్రస్తుత దశలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ఈ కేసుకు సంబంధించిన తదుపరి వాదనలను సింగిల్ బెంచ్ ముందే వినిపించాలని ఐపీఎస్ అధికారుల తరఫు న్యాయవాదులకు సూచించింది. దీంతో సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలు ప్రస్తుతానికి అమల్లోనే ఉండనున్నాయి. స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారుల సహకారంతో కొందరు ఉన్నతాధికారులు ఫోర్జరీ పత్రాలు సృష్టించి, రికార్డులు తారుమారు చేసి బినామీ లావాదేవీల ద్వారా భూదాన్ భూములను అక్రమంగా బదలాయించుకున్నారని పిటిషనర్ బిర్ల మల్లేశ్ తన పిటిషన్‌లో ఆరోపించారు. భూదాన్ చట్టం, తెలంగాణ భూదాన, గ్రామదాన నిబంధనలు-1965కు విరుద్ధంగా ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు తమ పేర్లతో, కుటుంబ సభ్యుల పేర్లతో భూములు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై సీబీఐ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని ఆయన కోరారు.

## ఢిల్లీలో రూ.2 వేల కోట్ల స్కాం..
## సిసోడియా, జైన్ లపై మరో కేసు

ఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు, మాజీ మంత్రులు మనీశ్ సిసోడియా, సత్యేందర్ జైన్ ల మెడకు మరో అవినీతి కేసు చుట్టుకుంది. ఢిల్లీ వ్యాప్తంగా ఆప్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పాఠశాలలు, క్లాస్ రూంల నిర్మాణంలో భారీ కుంభకోణం జరిగిందని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఆరోపించింది. ఆప్ హయాంలో మొత్తంగా 12 వేల స్కూళ్లు, క్లాస్ రూంల నిర్మాణం చేపట్టగా అందులో రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందని తేల్చింది. దీనిపై నాటి ఉప ముఖ్యమంత్రి, ఆప్ సీనియర్ నేత మనీశ్ సిసోడియా, మాజీ మంత్రి సత్యేంద్ర జైన్ లపై కేసు నమోదు చేసింది. ఏసీబీ ఆరోపిస్తున్న ప్రకారం.. ఆప్ ప్రభుత్వంలో మనీశ్ సిసోడియా ఉప ముఖ్యమంత్రిగా వ్యవహరించడంతో పాటు విద్యాశాఖ బాధ్యతలు కూడా నిర్వర్తించారు. సత్యేందర్ జైన్ పీడబ్ల్యూడీ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఆప్ హయాంలో మొత్తంగా 12,748 క్లాస్ రూంలు నిర్మించారు. ఈ పనులకు సంబంధించిన కాంట్రాక్టులు దక్కించుకున్న వారిలో ఎక్కువ మంది ఆమ్ ఆద్మీ పార్టీతో సంబంధం ఉన్న వారేనని ఏసీబీ ఆరోపించింది. నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయలేదని, దాంతో కాంట్రాక్ట్ వ్యయం ఏకంగా ఐదు రెట్లు పెరిగిందని పేర్కొంది. ఈ నిర్మాణ పనుల్లో అక్రమాలు జరిగాయని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) కూడా నివేదిక ఇచ్చిందని, అయితే, ఆ నివేదికను ఆప్ సర్కారు దాదాపు మూడేళ్ల పాటు తొక్కిపెట్టిందని ఆరోపించింది. క్లాస్ రూం నిర్మాణ వ్యయం దాదాపుగా ఐదు రెట్లు పెరగడంపై బీజేపీ నేతల ఫిర్యాదుతో ఈ వివరాలు వెలుగులోకి వచ్చాయని సమాచారం. ఢిల్లీ ప్రభుత్వంలో కీలక శాఖలను నిర్వహించిన వీరిద్దరూ గత కొంతకాలంగా పలు ఆరోపణలపై చట్టపరమైన చర్యలను ఎదుర్కొంటున్నారు. ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించిన కేసులో సిసోడియా, మనీ లాండరింగ్ ఆరోపణలపై సత్యేందర్ జైన్ లు జైలుకు వెళ్లి వచ్చారు. ప్రస్తుతం ఈ ఇద్దరు నేతలు బెయిల్ పై బయట ఉన్నారు. ఈ పరిస్థితుల్లో వారిపై తాజా ఆరోపణలు, కేసు నమోదు కావడం ఆప్ వర్గాల్లో కలకలం రేపుతోంది.

## తెలంగాణ టెన్త్ ఫలితాలను విడుదల చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

మొదటి పేజి తరువాయి

అత్యధికంగా గురుకుల పాఠశాలల్లో 98.7 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. ప్రైవేటు పాఠశాలల్లో 94.21 శాతం విద్యార్థులు పాసయ్యారు. ఈసారి సబ్జెక్టుల వారీగా మార్కులు, గ్రేడ్లను ఎస్ఎస్‌సీ బోర్డు ఇచ్చింది.

జూన్ 3 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు జరగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు జరుగుతాయని ఎస్ఎస్‌సీ బోర్డు ప్రకటించింది. ఫీజు చెల్లింపునకు తుది గడువు మే 16గా నిర్ణయించారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు మే 15వరకు అవకాశం కల్పించారు. ఇందుకోసం సబ్జెక్టుకు రూ.500 చొప్పున చెల్లించి రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. సబ్జెక్టుకు రూ.వెయ్యి చొప్పున చెల్లించి రీవెరిఫికేషన్‌కు దరఖాస్తుకు అవకాశం కల్పించారు.

ఒక్క విద్యార్థీ పాస్ కాని పాఠశాలలు రెండు

ఈ ఏడాది రెండు ప్రైవేటు పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా పాస్ కాలేదు. ఈ ఫలితాల్లో మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా 99.29శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. వికారాబాద్‌లో అతి తక్కువగా 73.97శాతం ఉత్తీర్ణత నమోదైంది.

సరికొత్త విధానం..

కాగా.. ఈసారి గ్రేడింగ్ స్థానంలో మార్కుల మెమోలపై సబ్జెక్ల వారీగా మార్కులు, గ్రేట్లను ఇచ్చారు. ఈమేరకు కొత్త మెమో నమూనాను కూడా విద్యాశాఖ విడుదల చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో మార్కుల విధానాన్ని తొలగించి గ్రేడింగ్ విధానాన్ని అమలులోకి తెచ్చిన విషయం తెలిసిందే. 2009 నుంచి ఈ విధానం అమలులోకి వచ్చింది. ఏ-1, ఏ-2, బీ-1,బీ-2, సీ-1, సీ-2, డి, ఈలుగా గ్రేడ్‌లను ఇచ్చేవారు. సబ్జెక్ట్‌ల వారీగా గ్రేడ్లతో పాటు సీజీపీఏ ఇచ్చేవారు. అయితే ఇప్పుడు అనూహ్యంగా ఈ విధానాన్ని తొలగించి సీజీపీఏ కాకుండా సబ్జెక్టులవారీగా మార్కులు, గ్రేడ్లు ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. అయితే విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలు, తల్లిదండ్రులు, విద్యార్థులతో చర్చించకుండానే సరికొత్త విధానాన్ని అమలు చేయడం పట్ల అనేక ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

## దేవినేని కుమారుడి వివాహం..
### హాజరైన తెలంగాణ సీఎం, మంత్రి లోకేశ్, ప్రముఖులు

అమరావతి: టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడు నిహార్ పెళ్లి వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. కంకిపాడులో జరిగిన ఈ వివాహ వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి నారా లోకేశ్, నారా భువనేశ్వరి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణతో పాటు ఏపీ, తెలంగాణకు చెందిన పలువురు ముఖ్య నేతలు హాజరయ్యారు. ఇక, తెలంగాణ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి విజయవాడ వెళ్లిన సీఎం రేవంత్‌కు హెలిప్యాడ్ వద్ద ఏపీ మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్ధన్ రెడ్డి స్వాగతం పలికారు. మంత్రి లోకేశ్, సీఎం రేవంత్ రెడ్డి కలిసి వివాహ వేడుక వద్దకు చేరుకుని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

### పాక్ కు విడిచే బదులు మాకు తాగు నీళ్లివ్వండి..
## పంజాబ్ కు హర్యానా సీఎం విజ్ఞప్తి

పంజాబ్ : హర్యానా, పంజాబ్ రాష్ట్రాల మధ్య నీటి పంపకాల వివాదం మరోసారి తీవ్రస్థాయికి చేరింది. తమ రాష్ట్రానికి తాగునీటిని విడుదల చేయాలని, లేదంటే భాక్రా డ్యామ్‌లోని అదనపు జలాలు పాకిస్థాన్ కు పోతాయని హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ పంజాబ్‌ను హెచ్చరించారు. వర్షాకాలంలో నీటిని నిల్వ చేసుకునేందుకు వీలుగా జూన్ లోపు భాక్రా జలాశయాన్ని ఖాళీ చేయాలని ఆయన నొక్కి చెప్పారు. "జలాశయంలో నీటిని నిల్వ చేయడానికి స్థలం లేకపోతే, అదనపు నీరు హరి-కే-పట్టన్ మీదుగా పాకిస్థాన్ కు వెళ్తుంది. ఇది పంజాబ్‌కు గానీ, దేశానికి గానీ మంచిది కాదు" అని సైనీ అన్నారు. ఈ వివాదం కారణంగా ఢిల్లీ తాగునీటి సరఫరాపై పైనా ప్రభావం పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాది తమకు రావాల్సిన పూర్తి వాటా నీరు అందలేదన్నారు. గత నెల భాక్రా బియాస్ మేనేజ్‌మెంట్ బోర్డ్ హర్యానాకు విడుదల చేసిన నీటిలో 500 క్యూసెక్కులు ఢిల్లీకి, 800 క్యూసెక్కులు రాజస్థాన్‌కు, 400 క్యూసెక్కులు పంజాబ్‌కే వెళ్లాయని, దీంతో హర్యానాకు వాస్తవంగా 6,800 క్యూసెక్కులు మాత్రమే అందాయని సైనీ వివరించారు. హర్యానా డిమాండ్ మేరకు నీటిని విడుదల చేయాలని బీజేపీ ప్రభుత్వం భాక్రా బియాస్ మేనేజ్ మెంట్ బోర్డు ద్వారా పంజాబ్‌పై ఒత్తిడి తెస్తోందని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ఆరోపించారు. హర్యానా ఇప్పటికే మార్చి నెలలో కేటాయించిన నీటి వాటాలో 103 శాతం వినియోగించుకుందని ఆయన పేర్కొన్నారు. ఇరు రాష్ట్రాల మధ్య సట్లెజ్-యమునా లింక్ కెనాల్ నిర్మాణంపై వివాదం ఏళ్లుగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. పంజాబ్‌లో వరి సాగు ఏప్రిల్ మే నెలల్లో ఉండదని, ఈ సమయంలో విడుదల చేసే నీరు కేవలం తాగునీటి అవసరాలకేనని సైనీ చెప్పారు. అయితే, సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేసిన నేపథ్యంలో, చినాబ్, జీలం వంటి నదుల జలాలను ఉత్తరాది రాష్ట్రాలకు మళ్లించాలని భగవంత్ మాన్ కేంద్రాన్ని కోరారు.

### పీవోకేను స్వాధీనం చేసుకోవడమే పరిష్కారం..
## భారత్‌కు బ్రిటిష్ ఎంపీ సూచన

ఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడిని దేశ ప్రజలంతా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయంపై తాజాగా భారత సంతతికి చెందిన బ్రిటిష్ ఎంపీ లార్డ్ మేఘనాథ్ దేశాయ్ స్పందించారు. కశ్మీర్ వివాదాన్ని పూర్తిగా రూపుమాపాలంటే పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని భారత ప్రభుత్వానికి సూచించారు. అదొక్కటే అన్ని సమస్యలకు పరిష్కారమన్నారు. ఉగ్రవాదులను శిక్షించడానికి, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే.. భారత్ కఠినంగా జవాబివ్వాలని కోరారు.

పాక్ చెత్త పనిపై సమాధానం దాటేసిన అమెరికా..!

పీఓకే ఎప్పటికీ భారత్‌దే అని మేఘనాథ్ దేశాయ్ అన్నారు. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడి చాలా క్రూరమైనదని ఆవేదన వ్యక్తంచేశారు. కశ్మీర్ వివాదంలో ఈ ఘటనే చివరిది కావాలని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తాను నమ్ముతున్నానని అన్నారు. కశ్మీర్‌లో ఉన్న సమస్యల్ని శాశ్వతంగా పరిష్కరిస్తానని ప్రధాని ఇప్పటికే పలుమార్లు చెప్పారని గుర్తు చేశారు.

ఉగ్రవాద నిర్మూలనలో భారత్‌కు సహకరిస్తాం: బ్రిటన్

పహల్గాం ఉగ్రదాడి నేరస్థులకు కఠిన శిక్ష విధించాలని తాము భారత్‌ను కోరుతున్నట్లు బ్రిటన్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ పేర్కొంది. ఉగ్రవాద నిర్మూలనలో న్యూఢిల్లీకి తాము ఎప్పటికీ అండగా ఉంటామని తెలిపింది. పహల్గాం ఘటనకు వ్యతిరేకంగా ఇటీవల లండన్‌లో భారతీయులు నిరసన చేపడుతున్న సమయంలో అక్కడి పాకిస్థాన్ హైకమిషన్ అధికారి వారిని బెదిరిస్తున్నట్లు ఉన్న వీడియో తమను ఆందోళనకు గురి చేసిందని తెలిపింది. దీనిపై విచారణ జరుపుతున్నామని వెల్లడించింది. ఇరుదేశాలతో తమకు సత్సంబంధాలు ఉన్నందున వారి మధ్య ఉద్రిక్తతలు చెలరేగాలని తాము కోరుకోవట్లేదని పేర్కొంది. కశ్మీర్ ప్రజల నిర్ణయాన్ని పరిగణనలోకి తీసుకొని.. వారు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడాన్ని భారత్-పాక్ తమ బాధ్యతగా భావించాలని సూచించింది.

### సింహాచలం దుర్ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి..
## మృతుల కుటుంబాలకు పరిహారం ప్రకటన

ఢిల్లీ: సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి చందనోత్సవంలో గోడ కూలి భక్తులు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రధాని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు చొప్పున, గాయపడిన వారికి రూ. 50వేల చొప్పున పరిహారం ప్రకటించారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సింహాచలంలో భారీ వర్షం కురిసింది. దీంతో సింహగిరి బస్టాండ్ నుంచి ఎగువకు వెళ్లే మార్గంలో షాపింగ్ కాంప్లెక్స్ వద్ద రూ. 300 టికెట్ కౌంటర్ వద్ద ఉన్న ఓ గోడ కుప్పకూలడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

జనం
రిపోర్టర్ తెలుగు దినపత్రిక
గురువారం -01 -మే-2025

# న్యూ జేపీ సూపర్ మార్కెట్ ను ప్రారంభించిన భద్రాచలం ఎమ్మెల్యే



ఎటపాక ( జనం రిపోర్టర్ ) : భద్రాచలంలోని చర్ల రోడ్ లో గల కేకే ఫంక్షన్ హాల్ దగ్గర శీలం నాగేశ్వరరావు అనే రాజుపేట యువకుని న్యూ జేపీ సూపర్ మార్కెట్ ను ఈరోజు ఉదయం 10 గంటలకు భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు రిబ్బన్ కటింగ్ చేసి అశేష జనాల మధ్యన ప్రారంభించడం



జరిగింది. అనంతరం గౌరవ ఎమ్మెల్యే కి పుష్పగుచ్చమిచ్చి సాలువాతో ఘనంగా సత్కరించి రాముల వారి ప్రతిమను బహుకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, భోగాల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ జివి రామిరెడ్డి , భీమవరపు వెంకటరెడ్డి బంబోతుల రాజీవ్, శీలం నాగేశ్వరరావు, శీలం సత్యనారాయణ శీలం కృష్ణ, శీలం శ్రీను, దేగల శ్రీరామ్ మూర్తి, సజ్జ సింహాచలం సజ్జ శ్రీనివాసరావు, శీలం సాయి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఫ్రీ స్కూల్ పిల్లలకు పలకల బహుకరణ




నార్పల ( జనం రిపోర్టర్ ) : మండల పరిధిలోని సెక్టార్ సుల్తాన్ పేట - అంగన్వాడీ కేంద్రం లోని ఫ్రీ స్కూల్ పిల్లలకు కానిస్టేబుల్ గంగాధర్, భార్య చంద్రలేఖ లు పలకలను బుధవారం బహుకరించారు. పలకలు బహూకరించిన కానిస్టేబుల్ దంపతులకు అంగన్వాడి కార్యకర్త కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త వరలక్ష్మి, సహాయకురాలు గీత తదితరులు పాల్గొన్నారు.

# వివక్ష లేని సమాజం కోసం పోరాడిన వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్



ఆత్మకూర్ వనపర్తి జిల్లా ప్రతినిది ( జనం రిపోర్టర్ ) : సమాజంలో అంటరానితనం వివక్షపై రాజీలేని పోరాటం చేసిన వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని తూంపల్లి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రాజ్యాంగ నిర్మాత విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ




గ్రామాలలో ఇప్పటికీ కులవిపివక్ష ఉండడం తనను బాధ కలిగించిందన్నారు. అంబేద్కర్ ఎస్సీ ఎస్టీలకే కాకా బీసీ మైనార్టీలు కోసం కూడా ఎంతో కృషి చేశారని కొనియాడారు. భారతదేశంలోని ప్రతి పౌరుడి హక్కుల కోసం రాజ్యాంగంలో హక్కుల కోసం ఆయన ఆర్టికల్స్ పొందుపరిచారని తెలిపారు. భారతదేశంలో అందరు సమానంగా ఉండాలని ఆయన నిరంతను కృషి చేసి మనకు ప్రపంచంలోని అత్యంత పెద్దదైన రాజ్యాంగాన్ని అందించారని అన్నారు. అంబేద్కర్ సమాజానికి అందించిన సేవలు మరువలేనివనీ అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాంగ్రెస్ మాజీ జెడ్పిటిసి బాల కిష్టన్న, రేగింతల సింగిల్ విండో చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి, ఆత్మకూరు సింగిల్ విండో చైర్మన్ గాడి కృష్ణమూర్తి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు పరమేష్ మక్తల్ మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తులసిరాజ్ యాదవ్ మాజీ మండలాధ్యక్షులు రహమతుల్లా, నల్లగొండ శ్రీనివాసులు, మనివర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రవికుమార్ యాదవ్, గ్రామ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

# మేడే పండుగ జయప్రదం చేయండి.



రాజవొమ్మంగి, ఏప్రిల్ 30 జనం రిపోర్టర్: అల్లూరి జిల్లా రంపచోడవరం డివిజన్ రాజవొమ్మంగి మండల పరిధిలో మే1న రాజవొమ్మంగిలో సిఐటియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించే కార్మికుల,కర్షకుల పండుగ మేడే కార్యక్రమాన్ని అంగన్వాడి,ఆశ,మిడ్డే మీల్స్,భవన నిర్మాణం, యూటీఎఫ్,తాపీ మేస్త్రులు,ఎలక్ట్రికల్, కార్పెంటర్లు,హమాలీ,పెయింటర్లు ఇతర ప్రజా సంఘాల నాయకులు,కార్మికులు,కర్షకులు, ఉద్యోగ ఉపాధ్యాయులు, వ్యవసాయ కూలీలు,ఉపాధి కూలీలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.ఉదయం 9 గంటలకు స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం నుండి కార్మికుల ర్యాలీ అల్లూరి జంక్షన్ వరకు సాగుతుంది.అనంతరం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద మేడే సభ, ప్రజా సంఘాల కార్యాలయం వద్ద సీఐటీయూ జెండా ఆవిష్కరణ,అనంతరం కార్మికులు ప్రదర్శించే కోలాటం,దింసా,కోలాటం, డప్పు వాయిద్యాలు, వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు.కావున యావన్మంది ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని మేడే పండుగను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు


## పదవ తరగతి ఫలితాల్లో శ్రీవాణి హై స్కూల్ ప్రభంజనం

# 570 మార్కులతో నలుగురు విద్యార్థులు

560 పైన ముగ్గురు విద్యార్థులు

550 పైన ఉత్తీర్ణత సాధించిన నలుగురు విద్యార్థులు

పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత




ఆత్మకూర్ /వనపర్తి జిల్లా ప్రతినిధి/ ఏప్రిల్ 30/ ( జనం రిపోర్టర్ ) : రాష్ట్రవ్యాప్తంగా బుధవారం విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఆత్మకూరు మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీ వాణి హై స్కూల్ విజయ దంక మోగించింది. పాఠశాలల్లో పరీక్షకు హాజరైన విద్యార్థులు అంతా ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాల్లో పూజ అనే విద్యార్థినికి 577/600 మార్కులతో ఆత్మకూరు మండలంలో మొదటి ర్యాంకును సాధించి చరిత్ర సృష్టించింది.అలాగే ఎండి జావిద్ 571/600 మార్కులు, ఎస్ నిఖిల్ 571/600 మార్కులు, మనిచెందెర్ 570/600 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచారు. పరీక్షకు హాజరైన 84 మంది విద్యార్థులలో 500కు పైగా విద్యార్థులు మార్కులు సాధించారు. పరీక్షకు హాజరైన 84 మంది విద్యార్థులకు 84 మంది విద్యార్థులు ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించారు .100% శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాల పట్ల పాఠశాల సలహాదారులు డాక్టర్ రాములు, విశ్వేశ్వర్, ప్రిన్సిపాల్ అభిలాష,వి లతా,గంగాధర్, రాఘవేందర్ గౌడ్ ,పి గంగాధర్ వెంకటేష్ గౌడ్, రుచి , సతీష్,శుభాసిష్ ,ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు, ఆత్మకూర్ పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

# పరశురాముడి జయంతి ఉత్సవాలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ .







రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 29. స్థానిక 33వ. డివిజన్ ముఖ్య నాయకులు బండి రాము ఆధ్వర్యంలో నిర్వహించిన పరశురాముడి జయంతి వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ , అధ్యక్షులు బొంతల రాజేష్ హాజరయ్యారుఈ సందర్భంగా పరిసర డివిజన్ ముఖ్య నాయకులు ముస్తఫా , ప్రకాష్ , ఉదయ్ రాజ్ ముఖ్య నేతలతో కలిసి ఎమ్మెల్యే పరశురాముడి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో బస్తీ పెద్దమనుషులు , మహిళలు, యువకులు, కాంగ్రెస్ పార్టీ తాజా మాజీ కార్పొరేటర్లు, పలు డివిజన్ల అధ్యక్షులు ,అన్ని విభాగాల అధ్యక్షులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## సింగరేణి ఆర్.జి -1 అద్వర్యంలో అంతర్గత బిటి రోడ్స్ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్....



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 30. రామగుండం ఏరియా-1 అద్వర్యంలో సింగరేణి సంస్థ ద్వారా చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరై, జవహర్ లాల్ నెహ్రూ క్రీడా ప్రాంగణం ముందర గల బిటి రోడ్స్ పనులను కొబ్బరి కాయ కొట్టి పనులను ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, సింగరేణి సంస్థ రామగుండం ఏరియా-1 ద్వారా సుమారు 5 కోట్ల రూపాయలతో 23 కిలో మీటర్ల మేరా, గోదావరిఖని అన్ని కాలనిలలో బిటి రోడ్స్ చేపట్టుచున్నట్లు తెలిపారు. దీనివలన గోదావరిఖని రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని తెలిపారు. గతంలో 40 సంవత్సరముల క్రితం రోడ్స్ చెడిపోయి చాల అద్వానంగా మారినవని ఆలాగే స్టేడియం కుడా ప్రత్యేక చొరవతో ఆధునికరించి అన్ని హంగులు కల్పించాలని తెలిపారు. అదే విధంగా అభివృద్ధి పదంలో దృష్టి సారిస్తూ నూతన ఒరవడికి శ్రీకారం చుడుతూ, సింగరేణి ద్వారా మరిన్ని పనులను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-1 ఏరియా జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్ , డిజియం పర్సనల్ కిరణ్ బాబు, సివిల్ యస్.ఇ వర ప్రసాద్, సివిల్ ఇఇ వసంత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తాజా మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గోన్నారు.

# పదవ తరగతి ఫలితాల్లో విజేత జయభేరి



అమరచింత వనపర్తి జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించిన ఎస్ఎస్సి పరీక్ష ఫలితాల్లో అమరచింత మునిసిపాలిటీ కేంద్రంలోని విజేత హై స్కూల్ విద్యార్థులు విజయ ఢంకా మోగించారు. విద్యార్థిని కే అమృత 546/600 మార్కులతో మండల టాపర్ నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఏ మోహన్ కరస్పాండెంట్ జాల్గి లక్ష్మీనారాయణ విద్యార్థినికి అభినందనలు తెలిపారు. తమ పాఠశాల నుంచి పరీక్ష వ్రాసిన 22 మంది విద్యార్థులలో 20 మందికి 400 మార్కులకు పైన సాధించారని తెలిపారు .ఈ ఫలితాలు సాధించడంలో మా పాఠశాలకు సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి , గ్రామ పెద్దలకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేకధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు.

# చికాగో అమరవీరుల పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి: సిపిఎం

## మే 3 కొంకనివాని పల్లి లో మేడే ఉత్సవాలు



అమరచింత వనపర్తి జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : అమరచింత మండలంలోని కొంకనోని పల్లి గ్రామంలో సిపిఎం గ్రామ శాఖ సమావేశం బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ మండల నాయకులు బి వెంకటేష్ మాట్లాడుతూ 1886 మే1 అమెరికా దేశంలోని చికాగో ప్రాంతంలో ఎనిమిది గంటల పని దినం కోసం కార్మికులు పెద్ద ఎత్తున పోరాటం చేస్తున్న సందర్భంలో పాలకులు జరిపిన కాల్పుల్లో అనేకమంది కార్మికులు చనిపోయిన రక్తంతో గూడిన గుడ్డను ఎర్రజెండాగా రూపం తరం చేసుకొని ఆనాటి నుండి ఈనాటి వరకు ప్రపంచ దేశాల్లో మే ఒకటిన ఎర్రజెండాలు ఎగర వేయడం జరుగుతుంది ప్రపంచ కార్మికులారా ఏకంకండి అనే నినాదంతో కార్మికుల పోరాటాలు జరుగుతున్నాయి. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కార్మిక చట్టాలను మారుస్తూ కార్మికులకు కనీస వేతనాలు అమలు కాకుండా ప్రయత్నాలు మన దేశంలో జరుగుతున్న కనుక కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కార్మికులకు ఎనిమిది గంటల పని దినం కోసం భారతదేశంలో కూడా అనేక సంవత్సరాలుగా పోరాటాలు నిర్వహిస్తున్న చరిత్ర ఎర్రజెండాలకు మాత్రమే ఉంది పార్టీ కార్యకర్తలు చికాగో అమరవీరుల స్ఫూర్తిని తీసుకొని కార్మిక పోరాటాలు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ కార్యదర్శి మహేష్ నాయకులు మొగిలి అన్న అంజిరెడ్డి శివ విష్ణు రెడ్డి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లా వైద్య అధికారిని పైజరిగిన దాడిని కండిస్తున్నాం....

# -మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి...



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 30. పెద్దపల్లి జిల్లా డి ఎం హెచ్ ఓ అధికారిని పై జరిగిన దాడిని ఖండించిన మాదిగ మిత్రమండలి రాష్ట్ర నాయకులు కోట గిరి పాపన్న, మాది హక్కుల దండోరా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి. పెద్దపెల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ గోదావరిఖని లోని మమత హాస్పిటల్ లో జరిగిన అవకతవకల మీద విది నిర్వహణలో ఉండి రైడింగ్ కు వెల్లిన జిల్లా అధికారిని అన్న ప్రసన్న కుమారి పైన జరిగిన దాడిని ఖండిస్తూ, ఆ దాడిలో పాల్గొన్న గోదావరిఖని ప్రముఖ వైద్యులు, హాస్పిటల్ నిర్వాహకుల పైన చట్టపరమైన చర్య తీసుకోవాలని, మాదిగ మిత్ర మండలి, మాదిగ హక్కుల దండోరా, ఎం ఆర్ పి ఎస్ నాయకులు ఖండించారు. ఈ వ్యవహారం లో ప్రముఖ పాత్ర వహిస్తున్న మాజి మేయర్ బంగి అనిల్ కుమార్, కార్పొరేటర్ మహంకాళి స్వామి లు ఒక్క వైద్య అధికారికి, మహిళకు సపోర్టుగా కాకుండ మెడికల్ దందను కొనసాగిస్తున్న వారికి వత్తాసు పలకడం విడ్డూరంగా ఉందని వారు అన్నారు. లింగ నిర్ధారణ స్కానింగ్ విషమై రైడింగ్ కోసం వెళితే రూమ్ కు తాళం పెట్టిన హాస్పటల్ యజమాన్యం రూమ్ తెరవమని చెప్పగా, అనుమతి ఇవ్వలేదని అదే సమయం లో ఒక్కసరిగా జిల్లా డీఎంహెచ్వో అధికారి పై మర్యాద లేని మాటలతో, బూతుపురాణం తో చంపుతం అంటూ బెదిరిచండం నిర్వాహకులకు తగదు అని వారు అన్నారు. ఒక దళిత మహిళ అని చిన్న చూపు చూస్తూ స్కానింగ్ రూమ్ తాళాలు కూడా తీయని హాస్పిటల్ యాజమాన్యం పై చట్ట పరిధిలో చర్యలు తీసుకోవాలని, వత్తాసు పలికిన వారి యొక్క హ్యాపిటాల్స్ క్లోజ్ చేసే వరకు మాదిగ మిత్ర మండలి, మాదిగ హక్కుల దండోర, ఎం ఆర్ పి ఎస్ పోరాటం చసుస్తుందని హెచ్చరించారు . ఈ కార్యక్రమం లో. ఎం ఆర్ పి ఎస్ నాయకులు పల్లె బాపు మాదిగ, ప్రముఖ ప్రజా పోరు విలేఖరి మామిడిపెల్లి శ్రీనివాస్, మాటూరి శంకర్ , మైస రవీందర్, కె నగేష్, ఇదునూర్ శంకర్ ,లు పాలుగొన్నారు.

## కాకినాడ జిజిహెచ్ సూపరిండెంట్ గా డాక్టర్ పాండురంగ విఠల్ అభినందించిన గొంప శివకుమార్



ఏలేశ్వరం, (జనం రిపోర్టర్) :ఉభయగోదావరి జిల్లాల ఆరోగ్య ప్రధాయిని కాకినాడ జి జి హెచ్ కు డిప్యూటీ సూపర్డెంట్ గా సూపర్డెంట్ బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ ఎం పాండురంగ విఠల్ కు పూర్తిస్థాయి సూపర్డెంట్ గా బాధ్యతలు అప్పగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు సూపర్డెంట్ గా పనిచేసిన డాక్టర్ లావణ్య కుమారి అనారోగ్య కారణాలతో సెలవులో ఉండటంతో, డి.ఎం.ఈ.డాక్టర్ డి. ఎస్.వి. ఎల్. నరసింహం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గ భారత చైతన్య యువజన పార్టీ ఇంచార్జ్ గొంప శివకుమార్ డాక్టర్ పాండురంగ విటల్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ, డాక్టర్ విటల్ ఆర్థోపెడిక్ డాక్టర్ గా జిల్లా వ్యాప్తంగా ఎంతో పేరు గడించారని, ఎంతో పేరున కాకినాడ జి జి హెచ్ కు మరింత పేరు వచ్చేలా గంగాధర్ కూడా ఉన్నారు.

### గతంలో కంటే రోడ్డు ప్రమాదాల శాతాన్ని తగ్గించాలి....

### ప్రాపర్టీ సంబంధిత నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి....

### -పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝూ...



రామగుండం(జనం రిపోర్టర్) :రామగుండం:ఏప్రిల్ 30. నెలవారి సమీక్షాలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పోలీస్ అధికారులతో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ బుధవారం కమిషనరేట్ కార్యాలయములో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. డిసిపి లు, అడిషనల్ డీసీపీ అడ్మిన్, ఎసిపిలు, ఇన్స్పెక్టర్లు, ఎస్.ఐలు పాల్గోన్న ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్, డివిజన్, జోన్లవారిగా పెండింగ్ కేసులకు సంబంధించి నేరస్థుల అరెస్టు, దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జ్‌షీట్‌కు సంబంధించి ప్రస్తుత కేసుల స్థితిగతులపై పోలీస్ కమిషనర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రామగుండము పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోద్కెన గ్రేవ్ కేసులు, మహిళలపై నేరాలు, ఆస్తి నేరాలు, పోక్సో కేసులు, మిస్సింగ్, గంజాయి, రోడ్డు ప్రమాదాల కేసులకు సంబంధించి సమాచారంతో పాటు, కేసుల పరిష్కారం కోసం ఏ విధమైన చర్యలు తీసుకోవడం జరిగిందని, మొదల్కెన అంశాలపై పోలీస్ కమిషనర్ పోలీస్ స్టేషన్ వారిగా పోలీస్ అధికారులతో సమీక్షా జరిపారు. అదేవిదంగా నేరాల నియంత్రణ కోసం అధికారులు తీసుకోవాల్సిన ముందస్తూ చర్యలపై పోలీస్ కమిషనర్ అధికారులతో చర్చించడం జరిగింది. సిపి మాట్లాడుతూ.. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గతంలో జరిగిన రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గించి ప్రజల ప్రాణాలు కాపాడుటకు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు సేఫ్టీ విభాగంతో కల్సి పనిచేయాలని, ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించడంతో పాటు రోడ్డు ప్రమాదాలకు గల కారణాలపై విశ్లేషణ చేసి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు చేపట్టాలని,రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలలో విలేజ్, టౌన్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేయాలి అని అధికారులను ఆదేశించారు.రాత్రి సమయాల్లో ప్రజలు మనపై వున్న నమ్మకానికి తగ్గట్లుగా దొంగతనాలు జరగకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా వుంటూ, విజబుల్ పోలిసింగ్, పెట్రోలింగ్ ముమ్మరం చేసి చోరీలను నియంత్రించాలని, ప్రధాన చోరీలకు పాల్పడిన నేరస్థులను గుర్తించడంతో పాటు దొంగతనాలను కట్టడి చేసేందుకు చోరీ కేసుల్లో శిక్ష అనుభవించి జైలునుండి బయటకు వచ్చే దొంగలపై నిఘా పెట్టాలని సూచించారు.పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు చట్టలకు లోబడి బాధితులకు సత్వరమే న్యాయం అందించాలని, అదే విధంగా నమోదైన కేసులలో పారదర్శకంగా విచారణ జరిపి నిందితులకు శిక్షపడేలా చూసి బాధితులకు పోలీస్ పై నమ్మకం, భరోసా కలిగించే విధంగా విధులు నిర్వహించాలన్నారు. నూతన చట్టాల ప్రకారం, సి సి టి ఎన్ ఎస్ 2.ఓ లో భాగంగా నేరాల విచారణ దర్యాప్తు, నిరూపణ లో ప్రజలకు బాధితులకు పోలీసులపై నమ్మకం భరోసా కలిగించే విధంగా, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగంలో భాగంగా గౌరవ కోర్ట్ నుండి ఇ- సమాన్స్ సి సి టి ఎన్ ఎస్ అప్లికేషన్ ద్వారా ఆన్లైన్లో నేరుగా పోలీస్ స్టేషన్ కి పంపించడం జరుగుతుంది. అట్టి ఈ సమాన్స్ డౌన్లోడ్ చేసుకొని ఫిర్యాదుదారునికి, నిందితులకు సాక్షులకు సర్వ్ చేయడం జరుగుతుంది తర్వాత వారి కి సర్వ్ చేసిన అక్నాలజిమెంట్ ను మరల ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలి, ఇట్టి పూర్తి ప్రక్రియ ఈ కోర్టు అప్లికేషన్లో కోర్టు సంబంధిత అధికారులకు ఆన్లైన్లో కనిపించడం జరుగుతుంది. ఇట్టి ప్రక్రియను ఎప్పటికీ అప్పుడు సి సి టి ఎన్ ఎస్ లో అప్లోడ్ చేయాలని సిపి సూచించారు. అదేవిదంగా ఇ -సైన్ ద్వారా ఫిర్యాదు దారుని దరఖాస్తు ఆధారంగా ఎఫ్ ఆర్ ఐ చేసిన వెంటనే ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్స్ సంబంధించిన డిజిటల్ సంతకం తో ఫిర్యాదుదారునికి ఎఫ్ఐఆర్ లింక్ వెళ్లడం జరుగుతుంది. ఇ - సాక్ష్య ద్వారా విచారణ, దర్యాప్తు సమయంలో లభించిన భౌతిక సాక్షాలు ను ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ ద్వారా సేకరించి సాంకేతిక పరిజ్ఞానంతో ఈ సాక్ష్యం లో అప్లోడ్ చేయడం ద్వారా భవిష్యత్తులో ఇలాంటి అవకతవకలు ఇబ్బంది జరగకుండా నిందితులకు శిక్ష పడే అవకాశం ఉంటుందని తెలిపారు.పోలీస్ శాఖ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించినట్లయితే శాఖ పరమైన చర్యలు తప్పవు అన్నారు. గంజాయి నియంత్రణకు పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని, రవాణా చేసే వారిని గుర్తించాలి కేసులు నమోదు చేయాలి, గంజాయి సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేయాలనీ ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్ , పెద్దపల్లి డిసిపి కరుణాకర్, అడిషనల్ డిసిపి అడ్మిన్ సి రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి రాఘవేంద్రరావు, మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్, ఏ సి పి, పెద్దపెల్లి ఏసిపి జి కృష్ణ, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ ట్రాఫిక్ ఏసిపి నరసింహులు, ఏసిపి మల్లారెడ్డి, ఏ ఆర్ ఏసీపీ ప్రతాప్, ఏఓ శ్రీనివాస్, సీఐ లు, వివిధ వింగ్స్ ఇన్స్పెక్టర్ లు, ఎస్ఐ లు పాల్గొన్నారు.

# గోదావరిఖని బాపూజీ నగర్‌లో జరిగిన శ్రీ పోతరాజు సవిత పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

## మహోత్సవం....

### ముఖ్య అతిథులుగా పాల్గొన్న మనాలి ఠాకూర్...





రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 30. రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్ రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ బుధవారం గోదావరిఖని బాపూజీ నగర్‌లో జరిగిన శ్రీ పోతరాజు సవిత పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం కు ముఖ్య అతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మహోత్సవం బుధవారం సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా నిర్వహించబడింది. ఉదయం 10:21 నిమిషాలకు ప్రత్యేక పూజలు, హోమాలు, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఆలయ పరిసరాలు భక్తుల ధార్మికతతో నిండిపోయాయి. ఈ పవిత్ర కార్యక్రమాన్ని మహంకాళి రాజ్యలక్ష్మి-స్వామి అలేటి కుటుంబం, గోదావరిఖని వారు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ విగ్రహ ప్రతిష్ఠ ద్వారా భక్తులకు ఆధ్యాత్మిక శాంతి చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, "ఇలాంటి దైవిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, భక్తి, సాంస్కృతిక విలువలను పెంపొందిస్తాయి" అని చెప్పారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానిక ప్రజలు హాజరై విజయవంతం చేశారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షుడు హరీష్, వెంకటేష్, సతీష్, ప్రసాద్, అన్వార్, రఘు, యూత్ కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ కుడిదల శివ, ప్రవీణ్, సురేష్, వసంత్, శ్రీకాంత్, సందేశ్, రాజు,అజయ్ సింగ్, సాయి, హేమంత్, జంపులు, సన్నీ, శ్రీనివాస్, బిక్షపతి ఇంకా డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# అర్హులను గుర్తించడంలో ప్రభుత్వ అధికారులు విఫలం

## బిజెపి మండల అధ్యక్షురాలు మంగ లావణ్య



అమరచింత వనపర్తి జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని ప్రకటించడంతో ఎంతోమంది పేదలు ఆశగా ఎదురుచూస్తున్నారని అందుకు భిన్నంగా అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలో అధికార పార్టీ నాయకులు మునిసిపల్ అధికారులు అర్హులను గుర్తించడంలో విఫలమయ్యారని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు మంగ లావణ్య సీనియర్ నాయకులు దుబాయ్ వెంకటేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ఈమెరకు బుధవారం అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలోని తొమ్మిదవ వార్డులో పార్టీ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. అనంతరం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అమరచింత మున్సిపాలిటీలో అధికార పార్టీ నాయకులు తమ కార్యకర్తలకు ఇండ్లు ఉన్నవారికి ప్రాధాన్యనిస్తున్నారని ఆరోపించారు. గుడిసెలు వేసుకున్న వారిని విస్మరించి ఇండ్లు ఉన్నవారికి ఇండ్లు కేటాయిస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ కమిషనర్ స్వయంగా పరీక్షించి అర్హులైన పేదలకే ఇండ్లు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు లేని పక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

హసన్ పర్తి మండలం ( జనం రిపోర్టర్ ) : హసన్ పర్తి జెడ్ పి.ఎస్ఎస్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో హసన్ పర్తి చెందిన రెబ్బ హాస్యశ్రీ సాయి 552 మార్కులు సాధించడం జరిగింది దీనికి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ఎన్నంశెట్టి. సుమాదేవి,మాజీ జిల్లా విద్యాకమిటీ సభ్యులు చకిలం.రాజేశ్వర్ రావు.హాస్య శ్రీ సాయిని అభినందించారు

# అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు వేసవి సెలవులు...



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 30. అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు మే నెలంతా వేసవి సెలవులు కమీషనర్ క్రాంతీ వెస్లీ ప్రకటించిందని, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోయేషన్ ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.సాయీశ్వరీ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యాలయంలో కమీషనర్ ఎ.క్రాంతి వెస్లీతో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోయేషన్ ఎఐటియుసి, ఇతర సంఘాలతో జరిపిన చర్చలలో వేసవి కారణంగా తల్లులకు, పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలకు రావటానికి కష్టతరంగా ఉందని, లబ్ధిదారులకు టేక్ హోంరేషన్ ఇచ్చి సెలవులు ప్రకటించాలని కోరిన వినతి మేరకు, కమీషనర్ సానుకూలంగా స్పందించి, వేసవి సెలవులు మే నెలంతా ప్రకటించినందుకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు, కమీషనర్‌కు, అధికారులకు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ అసోసియేన్ ఎఐటియుసి తరఫున ధన్యవాదాలు తెలిపారు.

# సేవే మాకున్న ధ్యేయం....

## -మక్కాన్ సింగ్ సేవ సమితి మానవతా స్ఫూర్తి....



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 30. పాలకుర్తి మండలంలోని శాలపల్లి గ్రామంలో మక్కాన్ సింగ్ సేవ సమితి ఆధ్వర్యంలో మరోసారి మానవతా విలువలు ప్రత్యక్షంగా ప్రతిబింబించాయి. పేదల కోసం సేవ చేయడమే ధ్యేయంగా తీసుకున్న ఈ సంస్థ, ఇప్పరపల్లి గ్రామానికి చెందిన ఉమా-కీ శే శ్రీనివాస్ దంపతుల కుమార్తె లిఖిత వివాహానికి కావాల్సిన వస్తువులను అందజేసింది. వివాహానికి అవసరమైన పుస్తె, మట్టెలు, చీరలు, ఇతర ప్రధాన సామాగ్రిని సమకూర్చిన మక్కాన్



సింగ్ సేవ సమితి చైర్మన్ మనాలి ఠాకూర్ ,బుధవారం జరిగిన వివాహ కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖంగా పాల్గొన్న , తాము మానవతా సేవలకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని మరోసారి చాటిచెప్పారు. ఈ సందర్భంగా మక్కాన్ సింగ్ సేవ సమితి చైర్మన్ మనాలి ఠాకూర్ మాట్లాడుతూ, "సేవే మాకున్న ధ్యేయం. అవసరమున్న వారికి అండగా ఉండటమే మాకిష్టమైన సేవ" అన్నారు. సమాజంలో అవసరమున్న వారికి అండగా నిలిచే ఈ సేవా కార్యక్రమం అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. మక్కాన్ సింగ్ సేవ సమితి చేస్తున్న సేవలు ప్రశంసనీయమైనవని స్థానికులు అభినందిస్తున్నారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు..

## మే 5 నుండి జూన్ 13 వరకు అవగాహన కార్యక్రమాలు..

### అవగాహన కార్యక్రమంను విజయవంతం చెయ్యండి..డాక్టర్ హేమంత కుమార్




అశ్వారావుపేట, ( జనం రిపోర్టర్ ) : అశ్వారావుపేటప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మెరుగైన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు, వానాకాలం సాగుకు రైతులను సమాయత్తం చేసేందుకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా,మే 5 నుండి జూన్ 13, 2025 వరకు ఆరు వారాలపాటు వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు 8 బృందాలుగా ఏర్పడి ఆరు వారాల పాటు అశ్వారావుపేట, దమ్మపేట, సత్తుపల్లి, వేంసూరు, ములకలపల్లి మండలాల్లోని వ్యవసాయ మరియు అనుబంధ అధికారుల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలను నిర్వహించనుంది. ఈ బృందాలలో ఇద్దరు వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు వ్యవసాయ అధికారులతో పాటు, వ్యవసాయ విద్యార్థులు కూడా పాల్గొని రైతు సోదరులకు ఆరు అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుంది. ముఖ్యంగా ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా యూరియా వాడకాన్ని తగ్గించడం, రసాయనాలను అవసరం మేరకు వినియోగించి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడడం, ఖరీఫ్ లో రైతులు ఉపయోగించే విత్తనాలు కొన్నప్పుడు రసీదును భద్రపరచుకోవడం, వివిధ పంటల్లో సాగునీటిని ఆదా చేసే అవసరమైన పరిజ్ఞానాన్ని, ప్రత్యామ్నాయ పంటల వివరాలను, చెట్ల పెంపకం లాంటి అంశాలపై శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు సూచనలు ఇస్తారు. అదేవిధంగా ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వడంతో పాటు వ్యవసాయ, అనుబంధ రంగాలపై దృష్టిని సారించి లాభాల బాట లో పయనించేలా వారిని చైతన్య పరుస్తారు. ప్రస్తుతం రైతుల ముంగిట్లోకి శాస్త్రవేత్తలను తీసుకురావడం వల్ల రైతుల సాంకేతిక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ప్రభుత్వం భావించి ఈ వినూత్న పద్ధతిలో అవగాహన కార్యక్రమాలను చేపట్టనుంది. ఈ పర్యటనల ద్వారా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు స్వయంగా తెలుసుకొని వ్యవసాయ అనుబంధ శాఖల సహకారం ద్వారా పరిష్కారాలు చూపిస్తారు. దీనికి సంబంధించిన బృందాలు గ్రామాలలో పర్యటిస్తున్నప్పుడు అధిక సంఖ్యలో రైతు సోదరులు అధిక సంఖ్య లో ఈ అవగాహన కార్యక్రమాలలో పాల్గొని విజయవంతం చేయాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత కుమార్ విజ్ఞప్తి చేశారు.

# బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు



రేపల్లె, ( జనం రిపోర్టర్ ) : బాపట్ల జిల్లా మహిళా అభిరుద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ వారు అక్షయ తృతీయ ని పురస్కరించుకొని ఈ రోజు పేటేరు నందు గల భావన్నారాయణ స్వామి వారి ఆలయం నందు బాల్య వివాహాలు పై అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కృష్ణ గారు మాట్లాడుతూ ఆలయ పూజారి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తుల కు బాల్య వివాహాలు వల్ల వచ్చే నష్టలు, పెళ్లి జరగకు ముందు వధువు మరియు వరుడి యొక్క వయసు కోసం వాళ్ళ డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్ లేదా మార్క్ లిస్ట్ లను తీసుకొని మాత్రమే పెళ్లిలు చేయాలి. 18 ఏళ్ళ లోపు బాలికల కు పెళ్లి చేసిన లేదా పెళ్లి కి సహకారం అందించిన వారి అందరు బాల్య వివాహ నిరోధక చట్టం 2006 ప్రకారం 1 లక్ష జరిమానా మరియు 2 సంవత్సరాల వారకు జైలు శిక్ష విధించబడును అనే తెలియజేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సుచిత్ర కార్యదర్శి శ్రీనివాసరావు దేవాలయ కమిటీ సభ్యులు సంఘ పెద్దలు పాల్గొన్నారు

# జర్నలిస్టులకు భారతీయ జనతా పార్టీ నాయకుల అండ



హసన్ పర్తి మండలం ( జనం రిపోర్టర్ ) : జర్నలిస్టుల డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం భారతీయ జనతా పార్టీ చేపడుతున్న మహాధర్నా భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల కోసం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని చేపడుతున్న మహా ధర్నా కార్యక్రమంలో పాల్గొనీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ జర్నలిస్టులకు కేటాయించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే ఇచ్చి ప్రభుత్వం ఇంతటి నిర్లక్ష్య ధోరణి మానుకోవాలని వారు కోరారు హసన్ పర్తి లో 18 మంది జర్నలిస్టులకు మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్ డబల్ బెడ్రూంలో ఇవ్వడం జరిగింది. అదేవిధంగా అర్హులైన వరంగల్లో ఉన్న జర్నలిస్టులకు డబల్ బెడ్ రూమ్ వెంటనే ఇవ్వాలని వారు కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎలక్షన్స్ సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలు 420 హామీలు ఏమి అమలు పరచకుండా పబ్బం గడుపుకుంటుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్,రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మాజీ శాసనసభ్యులు మర్తినేని ధర్మారావు, మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్,వన్నాల శ్రీరాములు,రాష్ట్ర పదాధికారులు, జిల్లా పదాధికారులు, మండల పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు, విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

# సింహాచలం దేవాలయం వద్ద గోడ కూలిన సంఘటనలో బాధ్యులను శిక్షించాలి

### చనిపోయిన కుటుంబాలకు ప్రభుత్వం మానవత్వంతో ఎక్స్గ్రేషియా ప్రకటించాలి

### ఓటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుండి దేవాలయాల వద్ద భక్తులు చనిపోవడం అవి ప్రభుత్వ హత్యలే ప్రభుత్వ నిర్లక్ష్మీ కారణంగా ఏడుగురు భక్తుల మృతి



రేపల్లె (జనం రిపోర్టర్) :ప్రభుత్వ నిర్లక్ష్య కారణంగా సింహాచలంలో గోడకూలి ఏడుగురు భక్తులు మృతిచెందడం బాధాకరమని వైఎస్ఆర్సిపి బాపట్ల జిల్లా అధికార ప్రతినిధి కృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవాలయాల్లో అపసృతులు జరిగి భక్తులు చనిపోతున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు అధికారంలోకి వచ్చిన వెంటనే వైయస్సార్సీపి వ్యవస్థాపక అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి పై నిందలు వేసేందుకు పవిత్ర శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం లో లడ్డులు కల్తీ జరిగిందని నిందలు మోపి ప్రజల్లో అభాష్ పాలయ్యారన్నారు అనంతరం వైకుంఠ ఏకాదశి రోజున దేవాలయానికి లక్షలాదిమంది భక్తులు వస్తారని తెలిసి కూడా బందోబస్తుని ఏర్పాటు చేయకుండా ఉండటంతో తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందడం జరిగినప్పటికీ ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం పలు విమర్శలకు తావిస్తుందన్నారు. గోశాలలో గోవులు చనిపోయి ఉంటే అది కూడా వైఎస్ఆర్సిపి నాయకులు పై నెట్టడం కూటమి ప్రభుత్వం కుటిల రాజకీయానికి నిదర్శనం అన్నారు ప్రజలు దీన్ని గమనిస్తున్నారు. సింహాచలంలో ఒకే గృహానికి చెందిన నలుగురు వ్యక్తులు మృతి చెందడం మరింత బాధాకరమని ఆ కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం ఆదుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన అన్నారు సింహాద్రి అప్పన్న నిజస్వరూపాన్ని చూసేందుకు చందనోత్సవానికి లక్షలాదిమంది భక్తులు వస్తారని తెలిసి నాణ్యతా లోపంతో వారం రోజులు క్రితమే గోడను కట్టడం భక్తులపై వారికున్న నిర్లక్ష్యాన్ని వ్యక్తం అవుతుందని అన్నారు దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు

# గుడిబండ తహశీల్దార్ కార్యాలయంలో సర్వేయర్ లైసెన్సు గడువు ముగిసినా సర్వేలు చేస్తున్న ప్రవేట్ సర్వేయర్

### అతను చెప్పిందే వేదం అన్నట్లు వ్యవహరిస్తున్న అధికారులు



గుడిబండ (జనం రిపోర్టర్) :మండల తహశీల్దారు కార్యాలయంలో ఓ ప్రైవేట్ సర్వయర్ లైసెన్సు గడువు ముగిసి ఏళ్ళు గడిచినా రైతుల పొలాల్లో ఏకపక్షంగా సర్వేలు నిర్వహిస్తూ రైతుల వద్ద నుండి వేలు, లక్షల్లో వసూళ్లు చేసినట్లు మండల వ్యాప్తంగా బలమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2019 వ సంవత్సరంలో సర్వేయర్ లైసెన్సు గడువు ముగిసినా ఇప్పటివరకూ రెన్యూవల్ చేసుకోకుండా కార్యాలయంలో తిష్ట వేసి రెగ్యులర్ సర్వేయర్ గా చెలామణి అవుతున్నారు. ఈ విషయం తహశీల్దారు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మండల అధికారులకు తెలిసినా ప్రైవేటు సర్వేయర్ కు ప్రాధాన్యత కల్పించడం పట్ల ప్రజలు విస్తుపోతున్నారు. రైతులు ప్రైవేటు సర్వేయర్ పై ఫిర్యాదులు చేసినా చూసి చూడనట్లు మండల సర్వేయర్ రెవెన్యూ ఇన్స్పెక్టర్, డిప్యూటీ తహశీల్దారు లు ఎందుకు వ్యవహరిస్తున్నారన్నది ఎవరికీ అంతుపట్టని విషయం. ప్రతి సచివాలయంలోనూ ప్రభుత్వ సర్వేయర్ లు అందుబాటులో ఉన్నా కూడా వారిని కాదని సంబంధం లేని వ్యక్తితో భూములు సర్వేలు నిర్వహిస్తుండడం, ఏకపక్షంగా సబ్ డివిజన్లు చేయిస్తుండటం గమనార్హం. గతంలో రైతులు ఫిర్యాదు చేయడంతో ప్రైవేటు సర్వేయర్ కు నోటీసులు కూడా జారీ చేసారు. అయినా కూడా ప్రైవేటు సర్వేయర్ తీరు మారకపోవడం చూసి అతనికి కార్యాలయంలో మండల అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నట్లు తెలుస్తోంది. మరి ఈ విషయం పై అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

# పట్టణంలో 4,73 కోట్లతో అభివృద్ధి పనులు





రేపల్లె (జనం రిపోర్టర్) :. పట్టణ అభివృద్ధి కోసం 4,72 ,46 ,000 రూపాయలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందని మున్సిపల్ చైర్ పర్సన్ కట్టమంగ తెలియజేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో బుధవారం కౌన్సిలర్ సాధారణ సమావేశం చైర్ పర్సన్ కట్టమంగ అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ మాట్లాడుతూ ఏజెండాలో పొందుపరిచిన 27 అంశాలను కౌన్సిల్ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలియజేస్తున్నట్లు తెలియజేశారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సాదాసీదాగా జరిగింది. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు మున్సిపల్ అధికారులు కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు

# దేశవ్యాప్త కుల గణన నిర్ణయం పై హర్షం వ్యక్తం

## -బీసీ ఆజాది రాష్ట్ర అధికార ప్రతినిధి బొంగోని అభిలాష్




శంకరపట్నం(జనం రిపోర్టర్) :ఈరోజు జరిగిన కేంద్ర ప్రభుత్వం క్యాబినెట్ నిర్ణయంలో రాబోయే జనగణనలలో కుల గణన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని,బీసీ ఆజాది పోరాట ఫలితంగానే వచ్చిందని అభిలాష్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఢిల్లీ నుండి గల్లీ దాకా అనేక సత్యాగ్రహ దీక్షలు చేపట్టి ఢిల్లీలో అన్ని కేంద్ర పార్టీ కార్యాలయాలను సందర్శించి రాబోయే జనగణనలో కులగణన చేర్పించాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం కారణంగానే నేడు ఈ నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని అయన తెలిపారు. రాబోయే రోజుల్లో బీసీ ఆజాది వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో మరిన్ని బీసీ పోరాటాలకు మేం సంసిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కులగనన అత్యంత పారదర్శకంగా జరిపి బీసీ లెక్కలను దేశవ్యాప్తంగా గుర్తించి వారికి తగిన బడ్జెట్ కేటాయించి వారికి తగిన ప్రాధాన్యత విద్య ఉద్యోగ రంగాలలో వారి వాటాను వారికి ఇవ్వాలని ఈ సందర్భంగా సూచించారు.

## : ఆర్జీ-1 జిఎం డి.లలిత్ కుమార్ అధ్యక్షతన ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం....



రామగుండం(జనం రిపోర్టర్) :రామగుండం:ఏప్రిల్ 30. రామగుండం ఏరియా -1 జియం కార్యలయం నందు గుర్తింపు సంఘం ప్రతినిధులతో, ఆర్జీ- 1 వివిధ విభాగాల అధికారులతో ఆర్జీ- 1 జిఎం డి.లలిత్ కుమార్ అధ్యక్షతన ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ గత నెలలో జరిగిన నిర్మాణాత్మక సామావేశంలో తీసుకున్న నిర్ణయాలు కొన్ని పరిష్కారం జరిగినవని, మరికొన్ని జరగవలసి ఉన్నవని అన్నింటికి సానుకుల వాతావరణంలో పరిష్కారం జరుగుతాయని తెలిపారు.ఇట్టి కార్యక్రమములో గుర్తింపు సంఘం ప్రతినిధులు వివిధ సమస్యలు మీదా చర్చించడం జరిగినది. ఎజెండా అంశాలు ఆర్జీ-1 ఏరియా లెవెల్ స్ట్రక్చర్ కమిటీ ఎజెండా లోని కొన్ని ప్రాదాన అంశాలను పేర్కొనడం జరిగినది.1. గోదావరిఖని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో క్రీడాకారుల కోసం లాన్ టెన్నిస్ 1 కోర్టు ఏర్పాటు చేయాలి, బాస్కెట్ బాల్ కోర్టు చుట్టూ తీగ జాలి, వాకర్స్ కోసం సింథటిక్ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి.2.సి ఇ ఆర్ క్లబ్ లో స్టేజికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఓపెన్ షెడ్ ఏర్పాటు చేస్తే పగటి పూట కార్యక్రమాలకు సౌకర్యంగా ఉంటుంది. 3. ఆర్జీ-1 ఏరియాలో పని చేస్తున్న కళాకారులకు జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ప్రాక్టీస్ చేసుకోవడానికి ఒక రూం ఇవ్వాలి, లేదా ఒక క్వార్టర్ ఇవ్వాలి, దీని వల్ల సంస్థకు సంబంధించిన సాంస్కృతిక, రక్షణకు సంబంధించిన కార్యక్రమాలను కళాకారులు కార్మికులకు అవగాహన కల్పించేందుకు అవకాశం ఉంది.4. ఆర్జీ-1 జి.ఎం.ఆఫీస్ బిల్డింగ్ మొత్తం రిపేర్ చేయించాలి, 5. మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన కార్మికులకు కూడా పూర్తి సర్వీస్ చేసిన వారికి మాదిరిగా సన్మానం చేసి, ప్రశంసా పత్రం ఇవ్వాలి6. ఆర్జీ-1 ఏరియాలోని మైన్స్, డిపార్ట్మెంట్ లలో ఉన్న బాత్ రూం లలో పాన్లు, గుట్కాలు తింటూ, సిగరేట్లు తాగుతూ ఎక్కడ పడితే అక్కడ ఉమ్మి వేస్తున్నారు. అవి క్లీనింగ్ లేక అపరిశుభ్రంగా ఉంటున్నాయి. పాన్లు, గుట్కాలు తినే వారికి, సిగరేట్లు త్రాగే వారికి మన కంపెనీ డాక్టర్చే అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి, వాటిని నిరంతరం సంబంధిత సిబ్బందిచే క్లీనింగ్ చేయించాలి. అదేవిధంగా సి.సి. కెమెరాలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.7. మెడికల్ ఇన్వాలిడేషన్, సర్వీస్ పూర్తి చేసి రిటైర్ అయిన కార్మికులకు క్వార్టర్ వెకేషన్ సర్టిఫికెట్ కోసం జి.ఎం. ఆఫీస్, సివిల్ డిపార్ట్మెంట్, ఏరియా వర్క్ షాప్ ల చుట్టూ మూడు, నాలుగు నెలలు తిరిగినా వెకేషన్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదు. దీని వల్ల వారు సర్వీస్ గ్రాట్యుటీ పొందడంలో చాలా ఆలస్యం జరిగి అనేక ఇబ్బందులు పడుతున్నారు. కనుక వారికి చాలా సమయం తీసుకోకుండా అన్ని ఒకే దగ్గర వీరి పనులు అయ్యే విధంగా వెకేషన్ సర్టిఫికెట్ వెంటనే ఇచ్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలి.8. ఆర్జీ-1 ఏరియాలోని గనులు, డిపార్ట్మెంట్ లలో ఖాళీగా ఉన్న సర్ఫేస్ జనరల్ మజ్దూర్ పోస్టులను అర్హులైన వారితో భర్తీ చేయాలి, 9.ఆర్జీ-1 ఏరియాలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల కు ఏప్రిల్, 2020 నుంచి మార్చి, 2025 వరకు సిఎంపిఎఫ్ చిట్టీలు ఇవ్వలేదు. ఈ చిట్టీలు వారికి ఇవ్వక పోవడం వల్ల వారి పి ఎఫ్ నిల్వలు ఎంత ఉన్నాయో వారికి తెలియడం లేదు. వెంటనే వారికి సిఎంపిఎఫ్ చిట్టీలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచి సెక్రటరీ అరెల్లి పోశం, రంగు శ్రీనివాస్, యస్.ఓ.టు జి ఎం గోపాల్ సింగ్, డిజియం పర్సనల్ కిరణ్ బాబు, అధికారులుు డివి రావు, ఎసియంవో డాక్టర్ అంబిక, ఆంజనేయులు, ఏజెంట్స్ చిలుక శ్రీనివాస్, రమేష్, పివో చంద్ర శేఖర్, జితేందర్ సింగ్, రవీందర్ రెడ్డి, హన్మంత రావు, ఎఐటియుసి నాయకులు అశ్విత, మదమ మహేష్, సురేష్, మల్లిఖార్జున్, సిద్దమల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడ జిజిహెచ్ సూపరిండెంట్ గా డాక్టర్ పాండురంగ విఠల్ అభినందించిన గొంప శివకుమార్



ఏలేశ్వరం,(జనం రిపోర్టర్) :ఉభయగోదావరి జిల్లాల ఆరోగ్య ప్రధాయిని కాకినాడ జి జి హెచ్ కు డిప్యూటీ సూపర్డెంట్ గా సూపర్డెంట్ బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ ఎం పాండురంగ విఠల్ కు పూర్తిస్థాయి సూపర్డెంట్ గా బాధ్యతలు అప్పగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు సూపర్డెంట్ గా పనిచేసిన డాక్టర్ లావణ్య కుమారి అనారోగ్య కారణాలతో సెలవులో ఉండటంతో, డి.ఎం.ఈ.డాక్టర్ డి. ఎస్.వి. ఎల్. నరసింహం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గ భారత చైతన్య యువజన పార్టీ ఇంచార్జ్ గొంప శివకుమార్ డాక్టర్ పాండురంగ విటల్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ, డాక్టర్ విటల్ ఆర్థోపెడిక్ డాక్టర్ గా జిల్లా వ్యాప్తంగా ఎంతో పేరు గడించారని, ఎంతో పేరున కాకినాడ జి జి హెచ్ కు మరింత పేరు వచ్చేలా గంగాధర్ కూడా ఉన్నారు.

## తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఏమాత్రం రక్షణ లేదు.....

**ప్రభుత్వ మహిళా వైద్యాధికారి పై దౌర్జన్యం చేసిన వైద్యులు,నాయకుల పై చర్యలు తీసుకోవాలి.....టిఆర్ఎస్ డి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడేటి శంకర్ గౌడ్, పార్టీ యూత్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఈదునూరి నర్సింగ్ డిమాండ్....**



రామగుండం:(జనం రిపోర్టర్) :రామగుండం:ఏప్రిల్ 30. రామగుండం నియోజకవర్గం గోదావరిఖని పట్టణంలోని మమత హాస్పిటల్ ను తనిఖీ చేయడం కోసం వచ్చిన పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ అధికారి అన్న ప్రసన్న కుమారి విధులకు ఆటంకం కలిగించి, స్థానిక ప్రజా ప్రతినిధి అండ దండలతో.. మహిళ ప్రభుత్వ వైద్య అధికారిని పట్ల దురుసుగా ప్రవర్తించి, దౌర్జన్యం చేయడం పట్ల తెలంగాణ రక్షణ సమితి డెమొక్రటిక్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నాం.. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడేటి శంకర్ గౌడ్, పార్టీ యూత్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఈదునూరి నర్సింగ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గోదావరిఖని ప్రైవేటు మమత హాస్పిటల్ నిర్వాహకులు అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ ద్వారా గుట్టు చప్పుడు కాకుండా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ, పుట్టబోయేది ఆడ బిడ్డ నా, లేదా మగ బిడ్డ నా తెలుసుకోవడానికి హాస్పిటల్ కి వచ్చే వారికి పరీక్షల ద్వారా ముందే చెపుతూ, ఆడబిడ్డ ఐతే.. అక్కడే వారికి అబార్షన్లు చేస్తూ వారి వద్ద నుండి వేలాది రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నారని, పెద్దపల్లి డిఎంహెచ్వో అధికారి ప్రసన్న కుమారి కి కొంతమంది చేసిన ఫిర్యాదు మేరకు ఇటీవలే గోదావరిఖనికి వచ్చిన పెద్దపల్లి జిల్లా మెడికల్ హెల్త్ అధికారి అన్న ప్రసన్న కుమారి ని, ఒక మహిళ అధికారి అని చూడకుండా ఇష్టానుసారంగా దుర్భషాలాడుతూ, చంపుతామంటూ బెదిరిస్తూ రెండు గంటల వరకు రూమ్ లో నిర్బంధించి, భయ భ్రాంతులకు గురిచేసిన హాస్పిటల్ నిర్వాహకులు, వైద్యులు పై, ఇతర నాయకులపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, తెలంగాణ రక్షణ సమితి డెమొక్రటిక్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం అని తెలిపారు.

## : తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలి..... నాణ్యతతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మించుకోవాలి....

**ధర్మారం మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను, ఆసుపత్రులను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష....**



రామగుండం:(జనం రిపోర్టర్) :రామగుండం:ఏప్రిల్ 30. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం తేమ శాతం రాగానే కొనుగోలు చేసి వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులకు సూచించారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ధర్మారం మండలంలోని దొంగతుర్తి, ఖిలా వనపర్తి, శాయం పేట, నంది మేడారం గ్రామాలలో ప్యాక్స్ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను, ఖిలా వనపర్తి గ్రామంలో పల్లె దవాఖాన, నంది మేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం తేమ శాతం వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ రికార్డు చేయాలని, తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని సెంటర్ నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు చేసిన ధాన్యం సత్వరమే మిల్లులోకి తరలించేందుకు అవసరమైన మేర వాహనాల సంఖ్య పెంచడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రైస్ మిల్లులు కొనుగోలు కేంద్రాల వద్ద ఎక్కడ హమాలీల కొరత రాకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా నాణ్యమైన ధాన్యం కొనుగోలు ప్రక్రియ జిల్లాలో జరగాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే చెల్లింపులు పూర్తి చేయాలని అన్నారు. ఖిలా వనపర్తి పల్లె దవాఖానా పరిధిలో గర్భిణీ స్త్రీలకు రెగ్యులర్ గా ఏ.ఎన్.ఎం.లు చెక్ అప్ నిర్వహించి, అవసరమైన టీకాలు వేసుకునేలా చూడాలని అన్నారు. నంది మేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఏ.ఎన్.సి రిజిస్ట్రేషన్ పరిశీలించి, ప్రతి గర్భిణీ స్త్రీ తప్పనిసరిగా రిజిస్టర్ అయ్యేలా చూడాలని అన్నారు. ఎన్.సి.డి సర్వే పకడ్బందీగా నిర్వహించి బీపీ, మధుమేహం వ్యాధి గ్రస్తులను గుర్తించి వారికి అవసరమైన మందులు పంపిణీ చేయాలని అన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ వైద్య అధికారులకు సూచించారు. అనంతరం నూతనంగా నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను పరిశీలించి, మిగిలి ఉన్న పెండింగ్ పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం బంజెరూ పల్లి గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద మంజూరు చేసిన 71 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయంతో నాణ్యమైన ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం 400 ఫీట్లకు తక్కువ కాకుండా 600 ఫీట్ల లోపు ఇండ్ల నిర్మాణం లో 4 విడతల లో ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం విడుదల చేయడం జరుగుతుందని, పనులు ప్రారంభించనీ లబ్ధి దారులను వెంటనే పనులు ప్రారంభించాలని అన్నారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట పీడీ .హౌసింగ్ రాజేశ్వర్, తహసిల్దార్ వకీల్ , వైద్యులు డాక్టర్ అనుదీప్, డాక్టర్ సుష్మిత , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## యాసంగి పంట కొనుగోలు వేగవంతం చేయాలి.....




రామగుండం(జనం రిపోర్టర్) :రామగుండం:ఏప్రిల్ 30. యాసంగి పంట కొనుగోలు వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్. చౌహాన్ లతో కలిసి ధాన్యం కొనుగోలు పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి, సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో యాసంగి పంట 2024-25 సంవత్సరంలో 54 లక్షల 89 వేల ఎకరాలలో సాగు జరిగిందని, కోటి 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా దాదాపు 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 2.55 లక్షల రైతుల నుంచి 19 లక్షల 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, వీరికి 2 వేల 289 కోట్లు మద్దతు ధర కింద చెల్లించామని, యాసంగి పంట కింద ఇప్పటి వరకు కొనుగోలు చేసిన 8 .8 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యానికి బోనస్ చెల్లించడం జరుగుతుందని అన్నారు. మే నెలలో కొనుగోలు కేంద్రాలకు అధికంగా ధాన్యం రానున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని,మంత్రి అధికారులను ఆదేశించారు. అకాల వర్షాలు కారణంగా రైతులు నష్టపోకుండా నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని మంత్రి సూచించారు. రానున్న 15 నుంచి 20 రోజుల పాటు సజావుగా ధాన్యం కొనుగోలు చేయడం ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత అంశమని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎటువంటి లోటుపాట్లు ఉండటానికి వీలులేదని అన్నారు. ధాన్యం కొనుగోలు అంశంలో రైతులు ధర్నా చేయాల్సిన పరిస్థితి ఎక్కడ రావద్దని మంత్రి అధికారులను ఆదేశించారు. రైస్ మిల్లులకు కేటాయించే ధాన్యం విలువలో 35% మాత్రమే మనం బ్యాంక్ గ్యారెంటీ అడిగామని, ఏ అంశంలో మినహాయింపులు ఇవ్వడం కుదరదని మంత్రి పేర్కొన్నారు. రైస్ మిల్లర్లతో కలెక్టర్, ఉన్నతాధికారులు చర్చించాలని, జిల్లాలలో అవసరమైతే గోదాములకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల ఇంటర్మీడియట్ గోదాముల కేటాయింపు జిల్లాల వారీగా అవసరం బట్టి మంజూరు చేయాలని మంత్రి పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. ప్రభుత్వానికి ఆర్థికంగా ఇబ్బంది ఉన్నప్పటికీ రైతులకు సమస్య రాకుండా చూసుకోవాలని అన్నారు. రైతుల దగ్గర నుంచి మద్దతు ధర పై ధాన్యం కొనుగోలు చేయడం ప్రాధాన్యతగా అత్యవసర పరిస్థితుల్లో డిఫాల్ట్ రైస్ మిల్లర్లకు దానం కేటాయింపు చేయడానికి అనుమతులు కూడా కలెక్టర్లకు జారీ చేస్తున్నామని తెలిపారు. హార్వెస్టర్ల తో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి పంట కోతల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలని అన్నారు.ధాన్యం కొనుగోలుపై వివిధ రాజకీయ పక్షాలు పత్రికలు, సామాజిక మాధ్యమాల ద్వారా చేస్తున్న దుష్ప్రచారాన్ని అధికారులు తిప్పి కొట్టాలని, ఎక్కడైనా నిజంగానే ఇబ్బందులు ఉంటే వాటిని సత్వరమే పరిష్కరించాలని మంత్రి సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న పౌరసరఫరాల శాఖ కమిషనర్ డిఎస్ చౌహన్ మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న రైస్ మిల్లర్లు నిబంధనలు ప్రకారం నడుచుకునేలా కలెక్టర్ అదనపు కలెక్టర్లు పకడ్బందీగా పర్యవేక్షించాలని, అత్యధికంగా రైస్ మిల్లులు ప్రభుత్వ పరిధిలోనే ధాన్యం ప్రాధాన్యతతో బిల్డింగ్ చేసేలా చూడాలని అన్నారు. ధాన్యం రవాణాకు వాహనాల ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని, రైస్ మిల్లుల వద్ద ధాన్యం బస్తాల అన్ లోడింగ్ ఆలస్యం కాకుండా చూడాలని, హమాలీల కొరత ఉండకుండా జాగ్రత్త పడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్దకు పెద్ద ఎత్తున ధాన్యం వస్తున్నప్పటికీ వేగవంతంగా కొనుగోలు చేయడంలో కొంత ఆలస్యం జరుగుతుందని, వీటిని సంపూర్ణంగా నివారించాలని అన్నారు.ధాన్యం కొనుగోలు అంశంపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేకంగా మానిటర్ చేయాలని అన్నారు. రైస్ మిల్లర్లు తాలు, తరుగు పేరు మీద ఎటువంటి కోతలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద గన్ని బ్యాగులు ఉండాలని రైతులకు నేరుగా ఇవ్వవద్దని, మనం కొనుగోలు చేసిన ధాన్యం నింపేందుకు మాత్రమే వినియోగించాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా మేనేజర్ శ్రీకాంత్, డీఎస్ఓ రాజేందర్, డి.ఆర్డి.ఓ కాలిందిని, సంబంధిత అధికారులు, సంబంధిత అధికారు లు, తదితరులు పాల్గొన్నారు.

## 96.89 శాతం విద్యార్థుల ఉత్తీర్ణత .... - జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి....



రామగుండం(జనం రిపోర్టర్) :రామగుండం:ఏప్రిల్ 30. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో పెద్దపెల్లి జిల్లాకు చెందిన 96.89 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, జిల్లా విద్యాశాఖ అధికారి డి మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.10వ తరగతి లో మొత్తం 7 వేల 387 మంది విద్యార్థులు పెద్దపల్లి జిల్లాలో హాజరు కాగా, 7 వేల 157 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, 108 పాఠశాలల్లో 100 శాతం పాస్ పర్సంటేజ్ నమోదయిందని జిల్లా విద్యాశాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## మే 8 లోపు ఆడిట్ నిర్వహణకు దరఖాస్తులు సమర్పించాలి... స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ....




రామగుండం(జనం రిపోర్టర్) :రామగుండం: ఏప్రిల్ 30. జిల్లాలోని మున్సిపల్ రికార్డుల ఆడిట్ నిర్వహణకు ఆసక్తి గల ఆడిటర్లు మే 8 లోపు దరఖాస్తులు సమర్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో ఉన్న రామగుండం నగరపాలక సంస్థతో పాటు పెద్దపల్లి ,సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీ లలోని ఏరియా లెవెల్ ఫెడరేషన్, టౌన్ లెవెల్ ఫెడరేషన్ కు సంబంధించిన రికార్డులను ఆడిట్ చేయడానికి ఆసక్తి,, అర్హత అనుభవం కలిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఆడిటర్లు పూర్తి వివరాలతో పాటు తగిన ధ్రువీకరణ పత్రాలను జతచేస్తూ దరఖాస్తు సమర్పించాలని అదనపు కలెక్టర్ తెలిపారు.ఆడిట్ నిర్వహణకు ఆసక్తి అర్హత కలిగిన ఆడిటర్లు తమ దరఖాస్తులను పథక సంచాలకులు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ వారి కార్యాలయంలో మే 08 లోపు సమర్పించాలని, ఇతర వివరాలకు చరవాణి నెంబర్ 6304894940 నందు సంప్రదించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను ఘనంగా సత్కరించిన పోలీస్ కమీషనర్....



రామగుండం:(జనం రిపోర్టర్) :రామగుండం:ఏప్రిల్ 30. రామగుండం పోలీస్ కమిషనరేట్లో సుధీర్ఘకాలంగా విధులు నిర్వహించి, నేడు ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బుధవారం ఘనంగా సత్కరించారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో ఏర్పాటు చేసిన కార్యక్రమములో పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులు ఇన్స్పెక్టర్ డి. కమలాకర్, ఏఆర్ఎస్ఐ ఎం. నర్సయ్య, సీనియర్ అసిస్టెంట్ ఎస్ సుందర్ రావు లను పోలీస్ కమిషనర్ పూలమాలలతో ఘనంగా సత్కరించడంతో పాటు, వారికి జ్ఞాపికలను అందజేసారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. తమ కుటుంబ క్షేమం కన్నా సమాజం క్షేమం కోసం నిరంతరం విధులు నిర్వహించేది పోలీసులు మాత్రమేనని, ప్రస్తుతం ఉద్యోగవిరమణ చేస్తున్న పోలీస్ అధికారులు వారి విధి నిర్వహణ సమయంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కోవడంతో పాటు, కొన్ని సమయాల్లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహించి వీరు రేపటి తరం పోలీసులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని, ఉద్యోగవిరమణ చేసిన పోలీసు అధికారులు తమ ఆరోగ్యం కోసం నిరంతరం యోగ లేదా వ్యాయామాన్ని కొనసాగించడంతో పాటు, వారి కుటుంబ సభ్యులతో సమయాన్ని కేటాయించాలని సుఖ సంతోషాలతో, ఆనందంగా జీవితం గడపాలని పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ఈ కార్యక్రమములో మంచిర్యాల డీసీపీ భాస్కర్ , పెద్దపల్లి డీసీపీ కర్ణాకర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు, ఏఓ శ్రీనివాస్, రామగుండం పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్ల కుంట పోచలింగం తో పాటు పదవీవిరమణ పొందిన పోలీస్ అధికారుల కుటుంబ సభ్యులు, వారి బంధుమిత్రులు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సుదీర్ఘ సేవలు అందించిన ఏఎస్ఐ హాషం గారికి ఘన వీడ్కోలు. జిల్లా ఎస్పీ కే. నారాయణ రెడ్డి, ఐపీఎస్..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిది(జనం రిపోర్టర్) :వికారాబాద్ ఉమెన్ పోలీస్ స్టేషన్ నందు అసిస్టెంట్ సబ్-ఇన్స్పెక్టర్ (ఏఎస్ఐ) గా విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందుతున్న ఎండి హాషం కి ఈ రోజు జిల్లా పోలీస్ కార్యలయం లో ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వికారాబాద్ జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై హాషం ని సన్మానించారు.ఎండి హాషం పోలీస్ శాఖలో కానిస్టేబుల్ గా ప్రస్థానం ప్రారంభించి, హెడ్ కానిస్టేబుల్ గా మరియు ఏఎస్ఐ గా పదోన్నతులు పొందారు. మొత్తం 41 సంవత్సరాల 7 నెలల సుదీర్ఘ కాలం పాటు ఆయన పోలీస్ శాఖకు నిబద్ధతతో విశేష సేవలందించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, హాషం గారి సుదీర్ఘ సేవలను, అంకితభావాన్ని, క్రమశిక్షణను కొనియాడారు. 41 ఏళ్లకు పైగా ఎలాంటి రిమార్క్ లేకుండా క్రమశిక్షణతో విధులు నిర్వహించడం ప్రశంసనీయమని, ఆయన సేవలు యువ సిబ్బందికి స్ఫూర్తిదాయకమని అన్నారు. పోలీస్ ఉద్యోగం ఎంతో సవాలుతో కూడుకున్నదని, కుటుంబ సభ్యుల సహకారం లేనిదే ఇంత సుదీర్ఘకాలం సమర్ధవంతంగా పనిచేయడం సాధ్యం కాదని, వారి త్యాగాలను కూడా గుర్తించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ప్రభుత్వ ఉద్యోగంలో పదవీ విరమణ ఒక ముఖ్యమైన ఘట్టమని, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి, ఎలాంటి మచ్చ లేకుండా పదవీ విరమణ చేస్తున్న హాషం కి అభినందనలు తెలిపారు. పదవీ విరమణ తర్వాత ఆయన తన కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. పోలీస్ శాఖ ఆయనకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.అనంతరం జిల్లా ఎస్ప హాషంని శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పి వీరేష్, ఏఓ జోతిర్మనీ , ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శివ చంద్ర ,ఆర్ఐ లు,జిల్లా పోలీస్ ప్రసిడెంట్ అశోక్ , ఇతర పోలీస్ అధికారులు, ఉమెన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, హాషం కుటుంబ సభ్యులు పాల్గొని హాషం కి శుభాకాంక్షలు తెలియజేశారు.

## పదవి విరమణ పొందిన వంగల శ్రీనివాస్ కి అర్జీ వన్ ఏరియా వర్క్షాప్ లో ఘనంగా సన్మానం....



రామగుండం(జనం రిపోర్టర్) :రామగుండం:ఏప్రిల్ 30. అర్జీ వన్ ఏరియా వర్క్షాప్ లో బుధవారం 36 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకొని పదవి విరమణ పొందిన, వంగల శ్రీనివాస్ ఫిట్టర్ కీ ఏరియా వర్క్ షాప్ కార్మికులు ,అధికారులు,యూనియన్ నాయకులు ఘనంగా సన్మానం చేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో వర్క్ షాప్ డీజీఎం గీతేంద్ర సింగ్ ,ఇంజనీర్లు చంద్ర శేఖర్ ,శ్రీనివాస్,రామకృష్ణ, ఆఫీస్ సూపరిడెంట్ నార్ల శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ మనోహర్, వర్క్ షాప్ పిట్ సెక్రటరీ బలుసు రవి, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ చంద్రమోహన్, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## తెలంగాణ గ్రూప్-1 పోస్టుల భర్తీపై బిగ్ ట్విస్ట్.. రంగంలోకి కేంద్ర మంత్రి బండి సంజయ్




**హైదరాబాద్, :** అనేక వివాదాలతో తెలంగాణ గ్రూపు 1 ఉద్యోగాల భర్తీ జరుగుతోంది. అభ్యర్థులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్న పబ్లిక్ సర్వీస్ కమిషన్ మొండిగా ముందుకుపోతుండడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఈ వివాదంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. భారీ ఎత్తున అవినీతి, అక్రమాలు, తప్పిదాలు జరిగాయని అభ్యర్థుల ఆందోళన చేస్తుండగా రంగంలోకి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ దిగారు. అభ్యర్థుల ఆందోళనను పరిగణలోకి తీసుకున్న బండి సంజయ్ అభ్యర్థుల తరఫున టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం కు లేఖ రాశారు.అభ్యర్థులు లేవనెత్తిన సందేహాలను బండి సంజయ్ లేఖలో ప్రస్తావించారు. వారం రోజుల్లో సమగ్ర సమాచారాన్ని అందించాలని టీజీపీఎస్సీని బండి సంజయ్ కోరారు. ఇప్పటికే గ్రూప్ 1పై హైకోర్టులో విచారణ కొనసాగుతుండగా.. అభ్యర్థుల ఆందోళనలు మిన్నంటుతున్నాయి. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో అక్రమాలు, అవినీతి ఆరోపణలతోపాటు తీవ్రమైన తప్పిదాలు జరిగాయని తీవ్ర ఆరోపణలు వస్తుండడంతో బండి సంజయ్ కుమార్ నివారణ చర్యలు చేపట్టారు. గ్రూప్ 1 ఉద్యోగాల భర్తీని రద్దు చేయాలని.. మళ్లీ పరీక్షలు నిర్వహించాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తుండడంతో దానిని లేఖలో బండి సంజయ్ ప్రస్తావించారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణ, మూల్యాంకన విధానం, ఫలితాల విషయంలో అనేక అక్రమాలు, అవకతవకలు, తప్పిదాలు జరిగాయని, నిబంధనల ఉల్లంఘన జరిగిందని వీటన్నింటిని నివృత్తి చేయాలని పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు సూచించారు. గ్రూప్ 1 పరీక్ష, ఫలితాలకు సంబంధించి ఈ కింది సమాచారాన్ని వారం రోజుల్లో పంపగలరని కోరుతూ పేజీల లేఖ రాశారు. ప్రధానంగా మార్కుల ప్రకటన, నోటిఫికేషన్ ఉల్లంఘన, పరీక్షా పత్రాల మూల్యాంకనంలో జరిగిన పొరపాట్లతోపాటు ఉర్దూ మీడియంలో రాసిన అభ్యర్థులకు టాప్ ర్యాంకులు రావడాన్ని బండి సంజయ్ లేఖలో ప్రస్తావించారు. హైకోర్టులో గ్రూప్ 1 కేసు విచారణ కొనసాగుతుండడంతో కమిషన్ నుండి వచ్చిన సమాచారం ఆధారంగా అవసరమైతే బండి సంజయ్ ఇంప్లీడ్ కావాలని భావిస్తున్నారు. అవినీతి, అక్రమాలు, తప్పిదాలకు తావులేకుండా మెరిట్ ప్రాతిపదికగా ఉద్యోగ నియామకాలు జరిగేలా టీజీపీఎస్సీని ప్రక్షాళన చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేస్తున్నారు. మార్కుల ప్రకటన, మూల్యాంకన ప్రక్రియ, హాజరు వివరాలు, ఫలితాల ప్రకటనకు ముందు డేటా లీక్, కోడ్ ఆధారిత మార్కుల నకిలీ లక్షణాలు, కేంద్రాల వారీగా అసమాన ఫలితాలు, అదనపు సమాచారం తెలపాలని లేఖలో బండి సంజయ్ టీఎస్‌పీఎస్సీని డిమాండ్ చేశారు.

## ఆ నీరు పాకిస్థాన్‌కు వెళ్లడం మినహా ప్రయోజనం లేదు

ఇంటర్నెట్‌డెస్క్: పంజాబ్ వద్ద భాక్రా రిజర్వాయర్‌లో అదనంగా మిగిలిపోయిన తాగునీరు తమకు



ఇవ్వాలని హరియాణా అభ్యర్థించింది. లేకపోతే.. ఆ నీరు పాకిస్థాన్‌కు వెళ్లడం మినహా ప్రయోజనం లేదని పేర్కొంది. భారత్ సింధూ జలాల ఒప్పందం నిలిపివేత నేపథ్యంలో హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ ప్రకటన విడుదల చేశారు. సింధూ జలాల ఒప్పందం పరిధిలోని అతిపెద్ద ఆనకట్టల్లో ఇది కూడా ఒకటి కావడం విశేషం. "జూన్ నాటికి భాక్రా నంగల్ ఆనకట్టను ఖాళీ చేయడం అవసరం. అప్పుడే వర్షాకాలంలో నదీ జలాలను నిల్వ చేసుకోవచ్చు. రిజర్వాయర్‌లో అప్పుడు నీరు లేకపోతే.. అదనపు జలాలు హరి-కె-పట్టాన్ నుంచి పాకిస్థాన్‌లోకి వెళ్లిపోతాయి. అది అటు పంజాబ్.. ఇటు హరియాణాకు ఉపయోగపడదు. దిల్లీలో ఆమ్‌ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్నన్నాళ్లు నీటి విడుదలకు పంజాబ్ ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరాలు లేవు. ప్రస్తుతం అక్కడ ఆప్ ప్రభుత్వం లేదు. అలాంటి సమయంలో దిల్లీ ప్రజలను శిక్షించేలా అలాంటి ప్రకటనలు ఎందుకు చేస్తున్నారు. అసలు హరియాణాకు రావాల్సిన వాటా జలాలే అందుబాటులోకి రాలేదు. గత నెల భాక్రా బేస్ మేనేజ్‌మెంట్ బోర్డ్ విడుదల చేసిన నీటిలో పంజాబ్, రాజస్థాన్, దిల్లీకి పోగా హరియాణాకు మిగిలింది కేవలం 6,800 క్యూసెక్కులు మాత్రమే. ఇక న్యాయంగా హరియాణాకు రావాల్సిన వాటా ఇచ్చినా.. అది భాక్రా ప్రాజెక్టులో నిల్వ ఉండే నీటిలో 0.0001 శాతానికి సమానం" అని నాయబ్ సింగ్ సైనీ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చీనాబ్, జీలమ్ సహా ఇతర నదుల నీటిని ఉత్తరాది రాష్ట్రాల వ్యవసాయ అవసరాలు తీర్చేందుకు మళ్లించాలని సైనీ కోరారు. ప్రస్తుతం భాక్రానంగల్ ప్రాజెక్టు పంజాబ్, హరియాణా, రాజస్థాన్ నీటి అవసరాలను తీరుస్తోంది.

## మనీష్ సిసోడియా సత్యేంద్ర జైన్ లపై
## అవినీతి నిరోధక విభాగం కేసు నమోదు



న్యూఢిల్లీ: దేశ రాజధానిలో పాఠశాల భవనాలు, తరగతి గదుల నిర్మాణాల్లో అవినీతికి పాల్పడ్డారంటూ ఆమ్ ఆద్మీ పార్టీ మాజీ మంత్రులు మనీష్ సిసోడియా సత్యేంద్ర జైన్ లపై అవినీతి నిరోధక విభాగం కేసు నమోదు చేసింది. ఏసీబీ అధికారాల సమాచారం ప్రకారం, ఆప్ ప్రభుత్వ హయాంలో 12,748 తరగతి గదులు, అసోసియేటెడ్ బిల్డింగ్‌ల నిర్మాణాలకు సంబంధించి రూ.2,000 కోట్ల మేర అక్రమాలు జరిగాయి. సిసోడియా, జైన్‌లను విచారించేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గత మార్చిలో ఆమోదం తెలిపారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17-ఎ కింద అనుమతులు మంజూరు కావడంతో దీనిపై ఏసీబీ కేసు నమోదు చేసింది. 12,748 తరగతి గదులు/భవనాల నిర్మాణానికి అంచనా వ్యయం రూ.2,892 కోట్లు. ఒక్కో క్లాస్ రూము నిర్మాణానికి రూ.24,86 లక్షల చొప్పున టెండర్లు ఇచ్చారు. గడువులోగా నిర్మాణాలు పూర్తికాకపోగా, భారీగా ఖర్చు చేశారు. గడువు ప్రక్రియను పాటించకుండా కన్సల్టెంట్లు, ఆర్కిటెక్ట్‌లను నియమించడం వల్ల సుమారు 5 రెట్లు వ్యయం పెరిగింది. 30 సంవత్సరాలు ఉండేలా తరగతి గదులను కట్టారు. అయితే వాటికి అయిన ఖర్చు మాత్రం 75 ఏళ్లు ఉండేలా అయింది. కాంట్రాక్టులు ఆప్ ఆద్మీ పార్టీతో దగ్గర సంబంధాలు ఉన్నవాళ్లకే దక్కాయి. తరగతి గదుల నిర్మాణం ప్రాజెక్టులో తీవ్రమైన అవకతవకలు జరిగినట్టు సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ గతంలో నివేదిక ఇచ్చింది. అయితే ఆ నివేదకపై మూడేళ్లుగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. (బీజేపీ ఫిర్యాదు): తరగతి గదులు, భవనాల నిర్మాణంలో అవకతవకలు జరిగినట్టు బీజేపీ ఢిల్లీ విభాగం ప్రతినిధి హరీష్ ఖురానా, బీజేపీ ఎమ్మెల్యే, ఆప్ మాజీ మంత్రి నీల్‌కాంత్ బక్షి తొలుత ఫిర్యాదు చేశారు. దీంతో ఏసీబీ లాంఛనప్రాయంగా విచారణ ప్రాంభించింది. కాగా, ఇప్పటికే లీగల్ చిక్కులు ఎదుర్కొంటున్న మనీష్ సిసోడియా, సత్యేంద్ర జైన్‌కు ఈ కొత్త కేసు మరిన్ని చిక్కులను తెచ్చిపెట్టే అవకాశం ఉంది. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ ఇప్పటికే సిసోడియా కస్టడీలో ఉన్నారు. సత్యేంద్ర జైన్ మరో మనీలాండరింగ్ కేసులో విచారణను ఎదుర్కొంటున్నారు.

## విశాఖలో మళ్లీ వర్షం.. సింహాచలంలో భక్తుల దర్శనానికి ఇక్కట్లు

**అమరావతి,:** విశాఖలో మళ్లీ వర్షం మొదలైంది. ఇప్పటికే సింహాచలం అప్పన్న సన్నిధిలో భారీగా భక్తులు క్యూలైన్‌లో నిలబడ్డారు. వర్షం కారణంగా భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక కొండ దిగువన బస్సులు దొరక్క భక్తులు అవస్థలు పడుతున్నారు. సమయానికి బస్సులు రాకపోవడంపై భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గంటల తరబడి కొండ కిందనే ఉండిపోయామని.. ఇంకెన్ని గంటలు కింద ఉండాలంటూ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంకోవైపు భక్తులు రద్దీ పెరగడంతో బస్టాండ్ ఏరియా అంతా కిటకిటలాడుతోంది. మంగళవారం అర్ధరాత్రి జరిగిన ఘటనతో అధికారులు పరిమితి సంఖ్యలో భక్తులు అనుమతి ఇస్తున్నారు. మరోసారి అలాంటి దుర్ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సింహాచలంలో గోడ కూలి ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. నలుగురు గాయపడ్డారు. ఇక ఈ ఘటనలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ దంపతులతో పాటు ఇద్దరు స్నేహితులు ప్రాణాలు కోల్పోయారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు చనిపోవడం విచారకరం. ఇక మృతుల కుటుంబాలకు రూ.25లక్షల పరిహారాన్ని ప్రభుత్వం ప్రకటించింది. రూ.కోటి పరిహారం ప్రకటించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. ఇక ఈ ఘటనపై దర్యాప్తునకు ప్రభుత్వం ఆదేశంచింది. 72 గంటల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

# కెనడాలో లిబరల్స్‌కు పట్టం





అనుకున్నట్టే అయింది. సోమవారం కెనడాలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో లిబరల్ పార్టీ మరోసారి విజయకేతనం ఎగరేయబోతున్నదని ఫలితాల సరళి తెలియజెబుతోంది. 343 స్థానాలున్న పార్లమెంటులో ఆ పార్టీకి పూర్తి స్థాయి మెజారిటీ వస్తుందా, లేక వేరే పార్టీల ఆసరా కావాల్సివస్తుందా అన్నది మరికొన్ని గంటల్లో తేలిపోతుంది. గత మూడేళ్లుగా అధికార లిబరల్ పార్టీ అసంతృప్తిని మూట గట్టుకుంది. ఈసారి దాని ఓటమి ఖాయమని అన్ని సర్వేలూ జోస్యం చెప్పాయి. మొన్న జనవరిలో సైతం కన్సర్వేటివ్‌ల కన్నా లిబరల్స్ 20 పాయింట్లు వెనకబడివున్నారు. ఈ దశలో అమెరికాలో డోనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడు కావటం, ఆయన మతిమాలిన ప్రకటనలు, ఎడాపెడా సుంకాల విధింపు లిబరల్ పార్టీకి వరంలా మారాయి. ఇతరేతర సమస్యలవీ మాయమై కెనడాను అమెరికా కబళిస్తుందన్న భయాందోళనలు ఆవహించి కన్సర్వేటివ్ పార్టీని కాదని జనం ఎప్పటిలా లిబరల్ పార్టీవైపే మొగ్గు చూపారు. ప్రధాని పదవి నుంచి జస్టిన్ ట్రూడో తప్పుకోవటం కూడా లిబరల్స్‌కు కలిసొచ్చింది. ఆయన స్థానంలో గత నెల మొదట్లో ప్రధానిగా వచ్చిన మార్క్ కార్నీ చకచకా చక్రం తిప్పారు. ట్రంప్‌తో సాన్నిహిత్యమున్న కన్సర్వేటివ్ పార్టీ వస్తే దేశాన్ని అమెరికా పాదాక్రాంతం చేయటం ఖాయమన్న ప్రచారం పనికొచ్చింది. కన్సర్వేటివ్ పార్టీ జాతకం తలకిందులైంది. ప్రపంచ సంపన్న రాజ్యాల్లో ఒకటిగా, అమెరికా సన్నిహిత మిత్ర దేశంగా, వాణిజ్య భాగస్వా మిగా దశాబ్దాలపాటు వెలుగులీనిన కెనడా కొన్నాళ్లుగా కష్టాల్లో కూరుకుపోయింది. అయిదేళ్ల నాడు విరుచుకుపడిన కోవిడ్ వల్ల ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది. జీవనవ్యయం అపారంగా పెరిగింది. నిరుద్యోగం తారస్థాయికి చేరింది. ఇళ్ల ధరలు ఆకాశాన్నంటాయి. నగరాల్లో అద్దెలు విపరీతంగా పెరగటంతో శివారు ప్రాంతాలకు జనం తరలిపోయారు. గృహ కొనుగోలుదారులు ఆ ఆలోచనను వాయిదా వేసుకున్నారు. ఇళ్లు లేని పౌరుల సంఖ్య పెరుగుతూ పోయింది. వీటన్నిటి పర్యవసానంగా పుట్టుకొచ్చిన సామాజిక అశాంతి మాదకద్రవ్యాల వాడకాన్ని ఊహించని స్థాయికి తీసుకెళ్లింది. దాంతోపాటే నేరాల సంఖ్య ఎక్కువైంది. నిజానికి ఇది కెనడాకు మాత్రమే పరిమితమైన సమస్య కాదు. సంపన్న దేశాలన్నీ ఈ మాదిరే సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. కానీ కెనడా పౌరులు దీన్నంతటినీ లిబరల్ పార్టీ చేతగానితనంగా పరిగణించారు. గత మూడేళ్లుగా కన్సర్వేటివ్ పార్టీ నాయకుడు పియర్ పొయ్‌లేవ్ దేశం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం తమకే సాధ్యమని ప్రచారం చేశారు. ఆవరించిన ఈ సంక్షోభం బహుశా చాలా దేశాల మాదిరే కెనడాలో కూడా మిత వాదపక్షాన్ని అందలం ఎక్కించివుండేది. కానీ ట్రంప్ అధిక సుంకాలు విధించటం, కెనడాను 51వ రాష్ట్రంగా విలీనం చేసుకోవటం ఖాయమని తరచు చెప్పటం కన్సర్వేటివ్‌ల ఆశల్ని అడియాసలు చేసింది. పౌరుల్లో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. వారు గెలిస్తే అదే జరగొచ్చునన్న సంశయం బలపడింది. తమ సహజ వనరులు, ఆర్థిక సంపద దోచుకోవటానికి అమెరికా తహతహలాడుతున్నదని, దీన్ని నిలువరించగల పార్టీ లేకుంటే ట్రంప్ అన్నంతపనీ చేస్తారని వోటర్లు భావించారు. ఇళ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతనిచ్చి వాటి ధరలు దిగొచ్చేలా చేస్తామని రెండు ప్రధాన పక్షాలూ వాగ్దానం చేశాయి. కొత్త భవనాల నిర్మాణంపైవున్న ఆంక్షల్ని ఎత్తేస్తామని కన్సర్వేటివ్‌లు హామీ ఇస్తే... ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందిస్తామని కార్నీ వాగ్దానం చేశారు. అమెరికా నిజ స్వరూపం తెలిసింది గనుక ఇకపై భద్రతకు ఆ దేశంపై ఆధారపడకుండా సొంతంగా సైన్యాన్ని రూపొందించుకోవాలని రెండు పార్టీలూ ప్రతిపాదించాయి. అధిక సుంకాల విషయంలో కూడా ఆ రెండు పక్షాలదీ ఒకే మాట. కెనడా ఎగుమతుల్లో 80 శాతం అమెరికాకే చేరతాయి. అధిక సుంకాలు విధిస్తే కెనడా తీవ్రంగా నష్టపోతుంది. తాము కూడా అధిక సుంకాల ప్రక్రియ మొదలెట్టామని,దాంతో ఆ దేశం గత్యంతరం లేక చర్చలకు దిగొచ్చిందని కార్నీ చెప్పారు. అయితే కన్సర్వేటివ్‌లు ఇంత బలంగా ట్రంప్‌పై విరుచుకుపడలేకపోయారు. ఇక అధిక వలసలపై కూడా ప్రజల్లో ఆగ్రహం వుంది. లిబరల్స్ ఏలుబడిలో వలసలు పెరిగాయని వారు నమ్మారు. పర్యావరణ పరిరక్షణ పేరుతో కొత్తగా ఖనిజాలు, శిలాజ ఇంధనాల వెలికితీతను నిలిపేయటంవల్ల ఆ రంగాల్లో ఉపాధి అవకా శాలు అడుగంటాయని, తామొస్తే దీన్ని సరిదిద్దుతామని కన్సర్వేటివ్‌లు హామీ ఇచ్చారు. నిజానికి ఈ సమస్యలే అమెరికాలో మితవాద రిపబ్లికన్ పార్టీని అందలం ఎక్కించాయి. కానీ ట్రంప్ రాకతో ఆ సమస్యలన్నీ మరుగునపడి కెనడాలోని మితవాద పక్షాన్ని కోలుకోలేని దెబ్బతీశాయి. కార్నీ ఏలుబడిలో మనతో కెనడా సంబంధాలు మెరుగుపడతాయన్న అభిప్రాయం అందరిలో వుంది. ఆర్థిక సంక్షోభం నుంచి దేశాన్ని గట్టెక్కించే దారి దొరక్క, ఆ అసంతృప్తిని కప్పిపుచ్చుటానికి ట్రూడో భారత్‌తో కోరి వైరాన్ని తెచ్చుకున్నారు. తీరా జగ్‌మీత్ సింగ్ ఆధ్వర్యంలోని ఖలిస్తానీ అను కూల న్యూడెమాక్రటిక్ పార్టీ(ఎన్‌డీపీ)కే ఈసారి దిక్కులేకుండా పోయింది. బలపడిన జాతీయ వాదం ఎన్‌డీపీని దెబ్బతీసింది. సిక్కువోటర్లు లిబరల్స్ వైపే మొగ్గారు. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ గవర్నర్‌గా, కెనడా సెంట్రల్ బ్యాంక్ చీఫ్‌గా కార్నీకి ఆర్థిక రంగంలో అపార అనుభవం వుంది. దేశ ఆర్థికవ్యవస్థకు నూతన జవసత్వాలు తెచ్చేందుకు ఆయన సహజవాయు నిక్షేపాల, ఖనిజాల వెలికి తీతకు ప్రాధాన్యమిస్తారని అంచనాలున్నాయి. మొత్తానికి ఇరుగుపొరుగు దేశాల్లో మితవాదులుంటే వారిలో ఒకరికి మాత్రమే గెలుపు దక్కుతుందని... ఒకచోట మితవాదుల దూకుడు మరొక దేశ మితవాదులకు ప్రాణాంతకమవుతుందని కెనడా ఫలితం నిరూపించింది.

# మందగమనం



'మోడీ 3.0 పాలనలోనే భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా దూసుకుపోగలదు. దేశాన్ని ప్రగతి పథంలో పరిగెత్తించగలిగేది బీజేపీ మాత్రమే' ఇవి వారి ప్రగల్భాలు. కానీ వాస్తవాలు దీనికి పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. ఈ విషయాన్ని కేంద్ర గణాంకాల శాఖ విడుదల చేసిన లెక్కలు కుండ బద్దలు కొట్టాయి. పాలకులు చెప్పేదానికి ఆ లెక్కలకు అస్సలు పొంతన లేకుండా పోయింది. దేశ అభివృద్ధికి కీలంగా భావించే పారిశ్రామిక రంగ ఉత్పత్తి ప్రమాదంలో పడబోతోందని తేల్చాయి. ఒక్క మాటలో చెప్పాలంటే పారిశ్రామిక ఉత్పత్తి మందగిస్తోంది. గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25)లో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) పెరుగుదల నాలుగు శాతానికి పరిమితమైందని కేంద్ర గణాంకాల శాఖ(ఎన్ఎస్ఓ) తాజాగా విడుదల చేసిన లెక్కలు స్పష్టపరిచాయి. ఈ లెక్కలను లోతుగా అధ్యయనం చేస్తే అనేక వాస్తవాలు బయటపడుతున్నాయి. ఉపాధి రహిత భారతంలో ప్రజల ఆదాయం రోజురోజుకూ తగ్గిపోతోంది. దానికి తోడు ఆకాశాన్ని తాకుతున్న అధిక ధరలతో సామన్యుల కొనుగోలు శక్తి చాలావరకు పడిపోయింది. ఈ కారణాలతో దేశంలో పారిశ్రామికాభివృద్ధి కుంటుబడుతోంది. ఇది ఇలాగే కొనసాగితే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత ప్రమాదంలో పడే అవకాశం వుంది. మన పాలకులు దేశాన్ని మతతత్వ రాజ్యంగా మార్చడానికి పడుతున్న తపనలో ఒక్కశాతమైనా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంపై పెట్టి ఉంటే కచ్చితంగా పరిస్థితి ఇలా ఉండేది కాదు.అయినా కార్పొరేట్లకు దాసోహమైన మోడీ పాలనలో పేదల బాగు చూడడం జరిగే పని కాదనేది క్రమంగా అర్థమవుతోంది. ప్రస్తుతం దేశంలో ప్రధాన రంగాలన్నీ ఉత్పత్తిలో వెనుకబడిపోయాయి. కోవిడ్ తర్వాత ఇంతతక్కువ వృద్ధి నమోదు కావడం మరింత ఆందోళన కలిగించే విషయం. అంటే ప్రజలు కనీస అవసరాలు కూడా తీర్చుకోలేని దుస్థితిలో ఉన్నారు. గడిచిన ఆర్థిక ఏడాదిలో ముఖ్యంగా తయారీ రంగం అత్యంత పేలవంగా ఉంది. ఇక 2024-25 ఆర్థిక ఏడాది చివరి నెలలోనూ పారిశ్రామికోత్పత్తిలో పెద్ద పురోగతి కానరాలేదు. ఇటీవల స్వల్ప పెరుగుదల కనిపించే సరికి పాలకులు సంకలు గుద్దుకున్నారు. కానీ ఇది భారత దేశ ఆర్థిక వ్యవస్థకు ఏమాత్రం సరిపోదని గుర్తించాలి. 2025 మార్చిలో తయారీ రంగం సగానికి పతనమై మూడు శాతంగా నమోదైంది. గనులు, విద్యుత్ రంగాలు కూడా ఇదే బాటలో నడిచాయి. ఇక వాహనాలు, గృహోపకరణాల లాంటి కన్స్యూమర్ డ్యూరెబుల్స్ ఉత్పత్తి సైతం మందగించింది. దేశవ్యాప్తంగా సాధరణ వస్తువుల కొనుగోలుకు ప్రజానీకం తటపటాయించే పరిస్థితి ఏర్పడింది. గత ఏడాదితో పోలిస్తే ఎన్ఎస్ఓ నివేదిక ప్రకారం ఈ ఏడాది ఫిబ్రవరిలో కాస్మోటిక్స్, ఆహారం, పానీయాలు, పెట్రోల్, డీజిల్, బట్టలు, చెప్పులు వంటి సరుకుల ఉత్పత్తి 2.1 శాతానికి పడిపోవడం దీనికి నిదర్శనం. రోజువారీ అవసరాల్లో అత్యంత సాధారణమైన వీటి వినియోగానికి కూడా ప్రజలు వెనకాడుతున్నారంటే ఇది దేశ ఆర్థిక తిరోగమనానికి కాకపోతే ఇక దేనికి సంకేతమో పాలకులే చెప్పాలి. దీనికితోడు ఇటీవల అమెరికా పెంచిన టారిఫ్‌లతో దేశంలోని టెక్స్‌టైల్స్, ఆభరణాలు, కెమికల్స్ రంగాల ఎగుమతులు పడిపోయి భవిష్యత్తులో వీటి ఉత్పత్తీ తగ్గనుంది. ఇది కూడా ఉపాధి కల్పనపై ప్రతికూల ప్రభావం చూపబోతోంది. బడ్జెట్ సమయంలో కేంద్ర ప్రభుత్వ అట్టహాస ప్రకటనల నేపథ్యంలో వివిధ అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు ఈ ఏడాది ప్రారంభంలో భారీ అంచనాలు వ్యక్తం చేశాయి. వీరి అంచనాలకు తగ్గట్టు జనవరిలో వృద్ధి కాస్త ప్రారంభమైనట్టు కనిపించినప్పటికీ రెండు నెలల కాలంలోనే భారిగా పతనం కావడం గమనార్హం. దేశంలో నెలసరి వేతన జీవులకు, స్వయం ఉపాధి కార్మికులకు గత ఐదేండ్లలో నిజ వేతనాలు దిగజారిపోయాయని అనేక లెక్కలు చెబుతున్నాయి. 22 కోట్ల ప్రజల దినసరి ఆదాయం కేవలం రూ.300. మోడీ ప్రభుత్వం విడుదల చేసిన జీవోలో క్షేత్రస్థాయి దినసరి కనీస వేతనం రూ.78 ఇస్తే చాలని ఉంది. ఇలాంటి విధానాల కారణంగానే దేశ ప్రజల కొనుగోలుపై పెట్టే ఖర్చుగానీ, పొదుపుగానీ తగ్గిపోయింది. ప్రజల ఆర్థిక పరిస్థితి ఇంతటి దయనీయంగా ఉంటే పారిశ్రామికాభివృద్ధి పెరిగి దేశ ఆర్థిక వ్యవస్థ ఎలా బలోపేతం అవుతుందో ఏలికలకే ఎరుక! ఏది ఏమైనా ప్రజల కొనుగోలు శక్తి తగ్గడంతో దేశంలో ఉత్పత్తులకు డిమాండ్ సన్నగిల్లిందనేది వాస్తవం. లెక్కలు కూడా ఇదే విషయాన్ని నొక్కి వక్కాణిస్తున్నాయి. ఈ పరిణామాలు ఉపాధి కల్పనపై ప్రతికూల ప్రభావం చూప డమే కాకుండా.. ముమ్ముందు పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఆర్థిక వ్యవస్థ మరింత మందగమనానికి దారి తీయడం ఖాయం. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలంటే ధరలను అదుపు చేయడం, ఉపాధి అవకాశాలు పెంచడంపై పాలకులు దృష్టి పెట్టాలి. ఇదే ఈ సమస్యకు ఉన్న మార్గమని నిపుణులు పదే పదే చెబుతూనే ఉన్నారు. తద్వారా మాత్రమే వస్తు ఉత్పత్తికి డిమాండ్ పెరుగుతుంది. ఫలితంగా పారిశ్రామిక ఉత్పత్తి, దేశ ఆర్థిక వ్యవస్థకు మద్దతు లభిస్తుంది. అయితే వాస్తవాలు మాట్లాడుకోవాలంటే మోడీ వల్లెవేస్తున్న 'వికసిత్ భారత్' మాటల్లోనే ఉంది, చేతల్లో కనిపించడం లేదు.

# సిరులొలికిస్తున్న సింగరేణి



కోలిండియా సహా దేశవ్యాప్తంగా ఉన్న ఇతర బొగ్గు ఉత్పత్తి సంస్థలు వేటిల్లో లేని విధంగా ఉద్యోగులకు ఏటేటా లాభాల్లో వాటా అందజేస్తున్న ఏకైక సంస్థ సింగరేణి. ఆర్థిక సంవత్సరం పూర్తి అయి దసరా సీజన్ వచ్చిందంటే సింగరేణి ప్రాంతంలో లాభాల బోనస్ ఒక హాట్ టాపిక్. రాష్ట్ర ప్రభుత్వం వాటా ప్రకటించగానే ఇక రాష్ట్రవ్యాప్తంగా అది చర్చనీయాంశం. లాభాల ప్రకటన వాటా నిర్ణయం అన్నింటికీ కీలకం ఉత్పత్తి లక్ష్యసాధన.ప్రతి సంవత్సరం లాగే గత ఆర్థిక సంవత్సరం 2024 -25 లోనూ లక్ష్యానికి చేరువగా ఉత్పత్తి, రవాణా సాధించింది. సింగరేణిలోనే 202324 గత ఆర్థిక సంవత్సరం రికార్డు స్థాయిలో లాభాలు ఆర్జించగా ఈసారి ప్రతికూల పరిస్థితుల్లోనూ సిఎండి సమర్థనాయకత్వం రాష్ట్రప్రభుత్వ సహకారంతో అంతకుమించి లాభాలు రానున్నట్లు అంచనా. అదే జరిగితే ఈసారి కూడా బొగ్గుబాయి ఉద్యోగులు భారీగా లాభాల బోనస్ పొందనున్నారు. 1889లో బ్రిటిష్ నైజాం సర్కార్ సంయుక్తంగా దక్కన్ కంపెనీగా ప్రారంభమై 1920 డిసెంబర్‌లో సింగరేణి కాలరీస్ కంపెనీగా రూపాంతరం చెందింది. తెలంగాణ మాగానాల్లో పురుడు పోసుకొని తెలంగాణ చరిత్రలో ఒక భాగమై.. ఉద్యోగులకు కన్నతల్లి కంటే ఎక్కువగా గుర్తింపుపొందింది. తన 136 ఏళ్ల సుదీర్ఘ చరిత్రలో అనేక విజయాలు సాధిస్తూ రాష్ట్రంలోనే ఏకైక ప్రభుత్వరంగ సంస్థగా లాభాల్లో కొనసాగుతున్నది. సంస్థ ప్రారంభం నాటినుండి ఎన్నో లక్షల మందికి ఉపాధి కల్పించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నులు, డివిడెంట్లు, రాయల్టీల రూపకంగా ఆదాయాన్ని సమకూరుస్తూ అభివృద్ధికి వెన్నుదన్నుగా నిలుస్తుంది.కాలానుగుణంగా యాంత్రీకరణను సద్వినియోగ పరుచుకుంటూ నేటికీ ప్రత్యక్షంగా 40 వేల మందికి, పరోక్షంగా మరో 30 వేల మందికి పైగా ఉపాధి కల్పిస్తూ తెలంగాణ కొంగుబంగారంగా నిలుస్తున్నది సింగరేణి. కేవలం ఉపాధి కల్పించడం మాత్రమే కాదు ఏటేటా లాభాల వాటగా సింగరేణి ఆర్జిస్తున్న లాభాల్లో పెద్ద ఎత్తున ఉద్యోగులకు వాటా చెల్లిస్తూ వారి కుటుంబాలకు అండగా నిలుస్తూ రాష్ట్రవ్యాప్తంగా అందరి మన్ననలు పొందుతుంది. దివాలా స్థితినుంచి లాభాల్లోకి 1990 దశకంలో సింగరేణి మనగడకు సందిగ్ధ పరిస్థితులు నెలకొన్నాయి. రెండుసార్లు బిఐఎఫ్ఆర్ వరకు వెళ్లి దాదాపుగా సంస్థ మూసివేత పరిస్థితిలు నెలకొన్నాయి. అప్పుడు కేంద్ర ప్రభుత్వం అప్పటి కేంద్ర మంత్రి, పెద్దపల్లి ఎంపీ 'కాకా' గడ్డం వెంకటస్వామి 1000 కోట్ల అప్పుగా అందించి సంస్థ నిలదొక్కుకునేందుకు అండగా నిలిచింది. అనతికాలంలోనే అప్పును వడ్డీతో సహా తిరిగి చెల్లించడమేకాక లాభాల్లోకి అడుగిడింది సింగరేణి.అయితే అప్పటి రాష్ట్ర సర్కారు అకారణ సమ్మెలతో సంస్థ మనుగడకే కష్టం, సంస్థకు లాభాలు వస్తే అందులో వాటా చెల్లిస్తామన్న ప్రకటనను సీరియస్‌గా తీసుకున్న సింగరేణి ఉద్యోగులు ఒక కుటుంబంగా శ్రమించి మూసివేతకు దగ్గరపడ్డ సంస్థను 1998- 1999 ఆర్థిక సంవత్సరానికి లాభాల్లోకి తీసుకొచ్చారు. దీంతో అప్పటి యూనియన్ నాయకులు రాష్ట్రప్రభుత్వం సింగరేణి కార్మికులకు ఇచ్చిన మాట నిలుపుకోవాలని ఒత్తిడి చేయడంతో తొలిసారి 10% లాభాల బోనస్ 1999 నుంచి ప్రారంభమైంది. ఇక నాటినుంచి ఏటేటా లాభాలు ఆర్జిస్తూ ఉద్యోగులకు కంపెనీ లాభాల్లో రాష్ట్రప్రభుత్వం అంగీకారంతో వాటా శాతం పెంచుతూ ముందుకు సాగుతుంది సింగరేణి. సిఎండిగా తొలి ఏడాది లక్ష్యం సాధన, ఉద్యోగులకు భారీగా లాభాల బోనస్ 2024 జనవరిలో అప్పటివరకు సంస్థ డైరెక్టర్‌గా కొనసాగుతున్న బలరాం నాయక్ (ఐఆర్ఎస్)ను సింగరేణి సిఎండిగా ఎంపిక చేసింది కాంగ్రెస్ సర్కార్. అప్పటికే డైరెక్టర్‌గా సంస్థ అభివృద్ధికి లక్ష్యసాధనకు తీవ్రంగా కృషిచేసిన బలరాం నాయక్ నాయకత్వంలో తొలి ఏడాదిలోనే సింగరేణి సంస్థ 2023 2024 ఆర్థిక సంవత్సరానికి ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడమే కాక భారీగా లాభాలను ఆర్జించింది. రూ. 4701 కోట్ల నికర లాభాలు ఆర్జించి అందులో రూ. 2289 కోట్లు సంస్థ విస్తరణకు పక్కకుపెట్టి మిగిలిన రూ. 2412 కోట్లలో 33% ఉద్యోగులకు రాష్ట్రప్రభుత్వ అంగీకారంతో లాభాల బోనస్ చెల్లించింది. 2023-2024 ఆర్థిక సంవత్సరం కేవలం మూడు నెలలు సిఎండిగా ఉన్నా ఉత్పత్తి లక్ష్యం 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధనలో కీలకంగా వ్యవహరించిన బలరాం నాయకత్వంలోని సింగరేణి సంస్థ 2024-2025 ఆర్థిక సంవత్సరానికి 72 మిలియన్ టన్నులను ఉత్పత్తి లక్ష్యంగా నిర్ణయించింది. కాగా వాతావరణ ప్రతికూల పరిస్థితులు ముఖ్యంగా భారీ వర్షాల కారణంగా సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి ప్రారంభంలో ఆటంకాలు ఎదురయ్యాయి. ఉత్పత్తి కీలకమైన ఓపెన్ కాస్ట్ గనుల్లో చాలారోజులు బొగ్గు ఉత్పత్తి నిలిచిపోవడం, సరైన వర్కింగ్ ప్లేస్‌లు లేకపోవడంతో కేవలం 69.01% మాత్రమే ఉత్పత్తిని సాధించింది. సత్ఫలితాలు ఇచ్చిన సిఎండి బలరాం క్షేత్రస్థాయి పర్యటనలు ఈసారి బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యసాధనలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులను అధిగమించేందుకు ఆర్థిక సంవత్సరం చివరి దశలో సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం నాయక్ స్వయంగా రంగంలోకి దిగారు. సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాలలో క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించారు. నేరుగా ఉద్యోగుల వద్దకే వెళ్లి వారి సాధకబాధకాలు అడిగి తెలుసుకొని ఉత్పత్తి లక్ష్యసాధన తద్వారా సంస్థ మనుగడపై అవగాహన కల్పించి వారిలో స్ఫూర్తి నింపారు. ఆయన క్షేత్రస్థాయి పర్యటనల సత్ఫలితాల కారణంగానే సంస్థ టార్గెట్ 72 మిలియన్ టన్నుల ఉత్పత్తికి ఆమడ దూరంలో ఉండాల్సిన పరిస్థితి నుంచి 69.01 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తితో దాదాపుగా 96% ఉత్పత్తి సాధించిగలిగింది. బొగ్గు ఉత్పత్తిలో కొద్దిగా వెనుకబడ్డప్పటికీ ఈ ఆర్థిక సంవత్సరం లాభాలలో విషయంలో ఎలాంటి డోకా లేదు. గత ఆర్థిక సంవత్సరం రూ. 4701 కోట్లు లాభాలు రాగా, ఈసారి అంతకు మించి 5వేల కోట్ల పైనే సంస్థ లాభాలు ఆర్జించనున్నట్లు అందులో ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ సారి కూడా సింగరేణి ఉద్యోగులు భారీగా లాభాల వాటా పొందనున్నట్లు అంచనా. రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారంతో సింగరేణి విస్తరణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సంపూర్ణ సహకారాలతో సింగరేణికి రావాల్సిన బకాయిలలో రూ. 1200 కోట్లు సాధించడమే కాకుండా సంస్థ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తున్నారు బలరాం నాయక్. 2016 లోనే నైనీ బ్లాకు వేలంలో దక్కించుకొని ప్రారంభానికి మీనమేషాలు లెక్కిస్తున్న దశలో స్వయంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఒడిశా ప్రభుత్వంతో చర్చలు జరిపి స్వల్పకాలంలోనే అన్ని రకాల అనుమతులతో ఇటీవలే ప్రారంభించారు. ఏటా కోటి టన్నుల ఉత్పత్తి లక్ష్యసాధనతో దాదాపుగా 38 ఏళ్లు నైనీ బ్లాక్ కొనసాగనుంది. సింగరేణి పరిధిలో ఇంకా 150 ఏళ్లకు సరిపడ బొగ్గు నిక్షేపాలు ఉండగా, రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో గోదావరి పరీవాహక ప్రాంతంలోని ఇతర బ్లాక్స్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో బొగ్గు బ్లాక్‌లు వేలంలో దక్కించుకొని సంస్థ విస్తరణకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

## ప్రధాని మోడీ పర్యటన వేళ .. వర్ష భయం



తుళ్లూరు (గుంటూరు) : ప్రధాని మోడీ రాజధాని అమరావతి పర్యటన వేళ .. వర్ష భయం వెంటాడుతోంది. ఆకాశంలో దట్టమైన మేఘాలు ప్రభుత్వానికి, అధికారులకు గుబులు పుట్టిస్తున్నాయి. మే 2న రాజధాని నిర్మాణ పనుల పున్ణ ప్రారంభానికి మోడీ అమరావతికి రానున్నారు. పలు అభివఅద్ధి పనులను ప్రధాని ప్రారంభిస్తారు. అనంతరం సచివాలయం వెనుక రహదారి పక్కన జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. సభకు రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 5 లక్షల మంది ప్రజలు తరలివస్తారని అంచనా వేస్తున్నారు. ప్రధాని పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. రహదారులు, పార్కింగ్, తాగునీరు, ఆహారం, వైద్య సౌకర్యం కల్పించడం, తదితర ఏర్పాట్లను చేస్తోంది. మంత్రులు, ఉన్నతాధికారులు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పనులు బుధవారం సాయంత్రానికి పూర్తవుతాయని చెబుతున్నారు. ఎదురుచూస్తున్న సమయం సమీపిస్తుండడం, పనులు కొలిక్కి వస్తున్న వేళ వర్ష భయం వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం పురపాలక, పట్టణాభివఅద్ధి శాఖ మంత్రి పి.నారాయణ ఏర్పాట్లను మరోసారి పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితులను, వర్షం కురిస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడుతూ వర్షం వస్తే ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని చెప్పారు. అందుకు అనుగుణంగా 7 వేల బస్సులు, 3 వేల కార్లకు పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాజధానిలో మట్టి నేలలు కావడంతో సి ఆర్ డి ఎ నిర్మించిన తారురోడ్ల పై వాహనాలను పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇతరత్రా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు.

## ఏపీలో నేటి నుంచి వాళ్లకు రేషన్ బంద్?



**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్‌లో రేషన్ కార్డులు ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం బిగ్ అలర్ట్ జారీ చేసింది. రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఇవాళ సాయంత్రం లోపు ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపింది. ఈకేవైసీ పూర్తి చేయకుంటే ప్రభుత్వ పథకాలు నిలిచిపోయే అవకాశం ఉందని తెలిపింది. ఐదేళ్ల లోపు పిల్లలు, 80 ఏళ్లు పైబడిన వృద్ధులకు కేవైసీ అవసరం లేదని స్పష్టం చేసింది. గడువు మరోసారి పొడిగించే అవకాశం లేదని,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రేషన్ కార్డు ఉన్నవారు ఈ-కేవైసీ చేసుకోవడానికి రేషన్ షాపులు, మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ ఆపరేటర్లు, డిప్యూటీ తహశీల్దార్లు, తహశీల్దార్లు, పౌరసరఫరాల శాఖ అధికారి కార్యాలయాల్లో ఈ సదుపాయం కల్పించారు గతంలో చాలా మంది ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు, వేరే ప్రాంతాల్లో చదువుకుంటున్నవాళ్లు, అలాగే పరీక్షల వల్ల ఈకేవైసీ చేసుకోలేకపోయారు. వాస్తవానికి మార్చి 31న గడువు ముగియగా.. ప్రజల ఇబ్బందుల్ని గమనించి ఆ గడువును ఈ నెల 30 వరకు పొడిగించింది. ఇటీవల చాలా మంది రేషన్ కార్డుదారులు చనిపోయారు.. వారి పేర్లను ఇంకా తొలగించలేదు. చాలా మంది చిరునామాలు కూడా మారిపోయాయి.. అందుకే ఈకేవైసీ తప్పనిసరి చేశారు. అడ్రస్ మారినప్పటికీ, రేషన్ ఎక్కడ తీసుకుంటున్నారో అక్కడే ఈకేవైసీ చేయించుకోవచ్చు అని ప్రభుత్వం తెలిపింది.

## అంగన్వాడీ చిన్నారులకు వేసవి సెలవులు ప్రకటన..!



**హైదరాబాద్, :** రాష్ట్రంలోని అంగన్వాడీ చిన్నారులకు మంత్రి సీతక్క ఆదేశాల మేరకు నెల రోజుల పాటు సెలవులు ప్రకటించారు. తల్లిదండ్రులు, అంగన్వాడీ యూనియన్ల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కమిషనరేట్ లో బుధవారం నాడు అంగన్వాడీ యూనియన్లతో డైరెక్టర్ కాంతి వెస్లీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో మే 1 నుంచి సెలవులు ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే అంగన్వాడీ లబ్దిదారులకు పౌష్టికాహారం అందించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అంగన్వాడీ చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు టేక్ హోం రేషన్ ద్వారా గుడ్లు, సరుకుల సరఫరా చేయనున్నారు. సెలవుల కాలంలో అంగన్వాడీ టీచర్లకు ఇతర విధులు అందించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇంటింటి సర్వే, హోం విసిట్స్, అంగన్వాడీలో చేర్చే చిన్నారుల గుర్తింపు వంటి విధులను విధిగా నిర్వర్తించాలని టీచర్లకు ఆదేశాలు జారీ చేసారు. ఈ ప్రభుత్వ నిర్ణయంతో వేసవి నుంచి లబ్దిదారులకు, సిబ్బందికి కాస్త ఉపశమనం లభించనుంది. అంగన్వాడీ చరిత్రలోనే తొలి సారిగా సెలవులు ఇవ్వడంతో, త్వరలో ఉత్తర్వులు ఇవ్వనునట్లు అధికారులు తెలిపారు. అంగన్వాడీలకు సెలవులు ప్రకటించిన ప్రభుత్వానికి, చొరవ చూపిన మంత్రి సీతక్కకు అంగన్వాడీ యూనియన్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాయి.

## మండుతున్న భూగోళం



హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా ఈ వారంలో 21 దేశాల్లో 110 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఇసిఎండబ్ల్యుఎఫ్ అంచనా వేసింది. వాటిల్లో పాకిస్తాన్, ఇరాన్, కువైట్, సౌదీ అరేబియా, మౌరిటానియా, ఇండియా, ఇరాక్, ఖతార్, సూడాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఒమన్, దక్షిణ సూడాన్, బ్రహెయిన్, మాలి, సెనెగల్, చాడ్,ఇథియోపియా, నైజర్, ఎరిట్రియా, నైజీరియా, బుర్కినా, ఫాసోలు దేశాలు ఉన్నాయి. బుధ, గురువారాల్లో 49 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఇసిఎండబ్ల్యుఎఫ్ (యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం-రేంజ్ వెదర్ ఫోర్కాస్ట్స్) నివేదిక తెలిపింది. ఈ వారాంతానికి రెండు మూడు డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పెరిగి 50 డిగ్రీల మార్కు దాటే అవకాశం ఉందని ఎసిఎండబ్ల్యుఎఫ్ అంచనా వేసింది. ఇక చైనాలో కూడా వేడిగాలలు వీచే అవకాశం ఉందని తుర్క్మెనిస్తాన్, ఉజ్బెకిస్తాన్లలో 38 డిగ్రీల కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయని ఇసిఎండబ్ల్యుఎఫ్ పేర్కొంది.పాకిస్తాన్లో ఎండలు మండుతున్నాయి. ఆ దేశంలో గత వారంలో దక్షిణ పాకిస్తాన్లో 48 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని.. బహుశా 50 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పాకిస్తాన్ వాతావరణ శాఖ అంచనా వేసింది. బహుశా ఈ ఏడాది కూడా 50 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వాషింగ్టన్ పోస్టు సూచించింది.

## సృజనాత్మక ఆర్థిక వ్యవస్థతో ఉపాధికి ఊతం



ప్రపంచ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు శరవేగంగా మారుతున్నాయి. ఒకప్పుడు వ్యవసాయం, పరిశ్రమలే ఆర్థిక ప్రగతికి మూలస్తంభాలుగా నిలిచాయి. ఆ తర్వాత సేవల రంగం, సమాచార సాంకేతిక విప్లవం ఆర్థికాధిపత్యాన్ని చలాయించాయి. నేడు, 21వ శతాబ్దంలో, మానవ మేధస్సు, కల్పనాశక్తి, ప్రత్యేక ప్రతిభల సమ్మేళనమైన సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ ఒక నూతన శక్తిగా ఆవిర్భవిస్తోంది. ఇది కేవలం కళలు, సంస్కృతికి పరిమితమైనది కాదుబీ ఆర్థికాభివృద్ధికి ఒక బలమైన చోదకశక్తిగా, లక్షలాది మందికి ఉపాధి కల్పించే విస్తృత వేదికగా, అంతర్జాతీయంగా భారతదేశ ప్రతిష్ఠను పెంపొందించే ఒక మహత్తర సాధనంగా ఇది పరిగణించబడుతోంది. అపారమైన సాంస్కృతిక సంపద, ప్రాంతీయ వైవిధ్యం, యువ జనాభా కలిగిన భారతదేశానికి ఈ సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ ఒక అద్భుతమైన అవకాశాలనిధి. అయితే, ఈ సువర్ణావకాశాన్ని మనం ఎంతవరకు అందిపుచ్చుకోగలుగుతున్నామనేది ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన విషయం. సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ అంటే వ్యక్తిగత సృజనాత్మకత, ప్రత్యేక నైపుణ్యం, అంతర్గత ప్రతిభల ఆధారంగా వృద్ధిచెందే విభిన్న పరిశ్రమల సమూహం. ఇది మేధోసంపత్తిని ఉపయోగించి ఆర్థిక విలువను సృష్టిస్తుంది. హస్తకళలు, చిత్రలేఖనం, శిల్పం, మ్యూజియంలు, చారిత్రక ప్రదేశాలు, సంగీతం, నృత్యం, నాటకం, మీడియా, సినిమాలు, యానిమేషన్, డిజైన్, ప్రకటనలు, సాఫ్ట్‌వేర్, గేమింగ్ వంటి అనేక రంగాలు ఇందులో అంతర్భాగంగా ఉన్నాయి.డిజిటల్ విప్లవం, ఇంటర్నెట్ వ్యాప్తి ఈ ఉత్పత్తులు, సేవలు ప్రపంచవ్యాప్తంగా వేగంగా చేరుకోవడానికి మార్గం సుగమం చేశాయి. ఈ రంగాలు పరస్పరం అనుసంధానమై ఆర్థిక విలువను పెంపొందిస్తున్నాయి. ప్రపంచ గణాంకాల ప్రకారం, సృజనాత్మక సేవల వాణిజ్యం 2022లో \$1.4 ట్రిలియన్లకు చేరుకుంది. సృజనాత్మక వస్తువుల ఎగుమతులు \$713 బిలియన్లు. ఈ రంగం ప్రపంచవ్యాప్తంగా \$ 2 ట్రిలియన్ల ఆదాయాన్ని, 50 మిలియన్ల ఉద్యోగాలను సృష్టిస్తోంది. సాఫ్ట్‌వేర్, పరిశోధన -అభివృద్ధి, ప్రకటనలు ముఖ్యమైన సహకారులుగా ఉన్నాయి. అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలు ఈ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నాయి. భారతదేశానికి ఇది ఒక ప్రత్యేకమైన అవకాశం. మన సాంస్కృతిక వారసత్వం, యువత దీనికి ప్రధాన బలం. భారత సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ విలువ ప్రస్తుతం \$ 30 బిలియన్లు. ఇది మన జిడిపికి 2.5% తోడ్పడుతుంది. 8% మందికి ఉపాధి కల్పిస్తుంది. ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ వంటి చిన్నరంగం కూడా వేల కోట్ల రూపాయల విలువ కలిగి ఉంది. గౌహతి, కొచ్చి వంటి నగరాలు సృజనాత్మక కేంద్రాలుగా ఎదుగుతున్నాయి. ఇది గ్రామీణ కళాకారులకు ఉపాధినిస్తుంది, పర్యాటకాన్ని ప్రోత్సహిస్తుంది, ఎగుమతులను పెంచుతుంది, దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తుంది. అయినప్పటికీ, ఈ రంగం ఇంకా పూర్తిగా వ్యవస్థీకృతం కాలేదు. సమగ్ర జాతీయ విధానం కొరవడింది. చిన్నసంస్థలకు పెట్టుబడి లభించడం కష్టంగా ఉంది. పైరసీ, మేధో సంపత్తి ఉల్లంఘనలు సృజనకారుల ఆదాయాన్ని దెబ్బతీస్తున్నాయి. సరైన మౌలిక సదుపాయాలు, డిజిటల్ నైపుణ్యాల కొరత వేధిస్తోంది. మార్కెటింగ్, బ్రాండింగ్ సమస్యలు ఉన్నాయి. ఈ రంగంపై సమగ్రమైన గణాంకాల కొరత విధాన రూపకల్పనకు ఆటంకం కలిగిస్తోంది. ఈ సవాళ్లను అధిగమించడానికి, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థను ఒక కీలక రంగంగా గుర్తించి సమగ్ర జాతీయ విధానాన్ని రూపొందించాలి. ప్రత్యేక నిధులు, సులభ రుణాల వ్యవస్థను ఏర్పాటు చేయాలి. కఠినమైన చట్టాలతో పైరసీని అరికట్టాలి. సృజనాత్మక కేంద్రాలు, డిజిటల్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలి. డిజిటల్ నైపుణ్యాలపై శిక్షణ అందించాలి. ఉత్పత్తుల ప్రదర్శనకు వేదికలు కల్పించాలి. సమగ్ర డేటా సేకరణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. భవిష్యత్తులో సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ మరింత కీలక పాత్ర పోషించనుంది. డిజిటలైజేషన్, కృత్రిమ మేధస్సు వంటి సాంకేతికతలు కొత్త అవకాశాలు సృష్టిస్తాయి. భారతదేశం తన సాంస్కృతికశక్తిని, యువత నైపుణ్యాలను ఉపయోగించి ఆర్థికాభివృద్ధి సాధించవచ్చు. ఇది ఆర్థికవృద్ధితో పాటు సామాజిక సమ్మిళితానికి, ప్రాంతీయ అభివృద్ధికి, దేశ 'సాఫ్ట్ పవర్'కు తోడ్పడుతుంది. 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని చేరుకోవడంలో సృజనాత్మక రంగం ఒక కీలక చోదకశక్తిగా నిలవగలదు. ఈ దిశగా మనం సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## అడ్డూఆపూ లేని అవినీతి!




అవినీతిపై ప్రభుత్వాల పోరాటం ఎప్పుడు మొదలైందో తెలియదు గానీ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా, ఆ పోరాటం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. పుట్టలకొద్దీ వెలుగుచూస్తున్న అవినీతిపరుల బాగోతాన్ని చూస్తుంటే, మన నేతల చేతలు మాటలకే పరిమితమవుతున్నాయని అనిపించకమానదు. పత్రికల్లో పతాక శీర్షికలకు ఎక్కుతున్న అవినీతిపరుల నిర్వాకాన్ని చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. మొన్నటికి మొన్న వందకోట్ల అవినీతి తిమింగలాన్ని అవినీతి నిరోధక శాఖ అరెస్ట్ చేసిందన్న వార్త తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించింది. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును పర్యవేక్షించిన ఓ ఉన్నతాధికారిపై ఎసిబి జరిపిన దాడుల్లో దాదాపు వంద కోట్ల రూపాయల విలువైన అక్రమాస్తులు బయటపడ్డాయి. సదరు మహాశయుడు భారీయెత్తున పొలాలు, విల్లాలు, నగానట్రా సమకూర్చుకున్నట్లు వెల్లడైంది. సోదాలు ఇంకా జరుగుతున్నందున ఈ ఆస్తుల విలువ ఎంతకు చేరుతుందో అంచనా వేయలేం. ఈ కేసులో నిజానిజాలు ఎలా ఉన్నా, పత్రికల్లో వచ్చిన ఈ వ్యవహారాన్ని చూసి, ఈ దేశంలో అవినీతి ఎప్పుడు అంతమవుతుందోనని సామాన్య జనం నిట్టూర్పు విడిచి ఉండవచ్చు. కానీ, అవినీతికి చిరునామాగా మారిన రాజకీయ వ్యవస్థ మారనంతకాలం అవినీతిని దేశంనుంచి పారదోలడం అత్యాసే అవుతుందని మాత్రం ఘంటాపథంగా చెప్పవచ్చు. దేశంలో పెచ్చుమీరుతున్న అవినీతి గురించి సర్వోన్నత న్యాయస్థానం సైతం పలు సందర్భాల్లో ఆందోళన వెలిబుచ్చినా మన నాయకమ్మన్యులలో చలనం మాత్రం కలగడం లేదు. పటుతరమైన చట్టాలు చేసి, అవినీతిపై ఉక్కుపాదం మోపి అందరికీ ఆదర్శంగా నిలవాల్సిన రాజకీయ నేతలే కాసులకు కక్కుర్తిపడి, దేశ భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నారు. అవినీతిని అరికడతామంటూ ప్రతినలు పలికే నేతలు ఆచరణలో అందుకు పూర్తి విరుద్ధంగా ప్రవర్తించడం దౌర్భాగ్యం కాక మరేమిటి? అవినీతి కేసులలో ఇరుక్కుని బెయిల్ పై బయటకు వచ్చినవారే అక్రమాలను అరికడతామంటూ ప్రగల్భాలు పలుకుతుంటే నమ్మడం ఎలాగంటూ సాక్షాత్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీయే ఒక సందర్భంలో ఆక్రోశం వెలిబుచ్చారంటే రాజకీయాలు నైతికంగా ఎంతగా పతనమయ్యాయో అర్థం చేసుకోవచ్చు. లోక్‌సభకు కొత్తగా ఎన్నికైనవారిలో 251 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఆ మధ్య అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫారమ్స్ సంస్థ చేపట్టిన అధ్యయనంలో తేలడం ఇందుకు మరో ఉదాహరణ. ఆ మాటకొస్తే, అవినీతిని అరికట్టేందుకు మనకు ఉన్న సంస్థలు, చట్టాలు బోలెడు. అవినీతి నిరోధక శాఖ, కేంద్ర దర్యాప్తు సంస్థ, ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ వంటి సంస్థలు, అవినీతి నిరోధక చట్టం, ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్, ప్రజావేగుల చట్టాలు, సమాచార హక్కు చట్టం వంటివి అనేకం ఉన్నా, అవినీతి అణువైనా తగ్గకపోవడానికి కారణాలు అనేకం. దర్యాప్తు సంస్థలు ఎంతో శ్రమించి అవినీతిపరులను గుర్తించి అరెస్టు చేస్తున్నా, ఆయా కేసులలో శిక్షపడుతున్నది కొద్దిమందికి మాత్రమేనంటే ఆశ్చర్యం కలుగకమానదు. చట్టాలలోని లొసుగులు, న్యాయస్థానాల్లో ఏళ్లూపూళ్లూ పడుతున్న విచారణ, సరైన సాక్ష్యాధారాలు చూపలేకపోవడం వంటివి ఇందుకు కొన్ని కారణాలుగా చెప్పుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా చూసుకుంటే జనాభాతో కిటకిటలాడే ఆసియా దేశాలలో అవినీతి మరీ పెచ్చరిల్లిపోతోంది. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ విడుదల చేసిన ర్యాంకుల్లో మొత్తం 180 దేశాల జాబితాలో భారత దేశానిది 96వ స్థానం. ఈ ర్యాంకు ఏ ఏటికాయేడు అంతకంతకు దిగజారిపోతూ ఉండటం మరీ సిగ్గుచేటు. ఇక పాకిస్తాన్ వంటి దేశాల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ప్రపంచవ్యాప్తంగా ఏటా ట్రిలియన్ డాలర్లు అవినీతిపరుల ఖాతాల్లోకి చేరుతోందంటూ ఆ మధ్య ఐక్యరాజ్య సమితి సైతం ఆందోళన వెలిబుచ్చింది. అవినీతికి అడ్డుకట్ట వేయగలిగితే ప్రభుత్వాలకు మరింత ఆదాయం సమకూరుతుందనడంలోనూ, ప్రజల జీవితాలు మెరుగుపడతాయనడంలోనూ సందేహం లేదు. అయితే పిల్లిమెడలో గంట ఎవరు కడతారన్నదే ప్రశ్న. అవినీతి నిర్మూలన ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు. ప్రజలూ కీలక పాత్ర పోషించవలసిందే. అవినీతికి తాము దూరంగా ఉండటంతోపాటు అవినీతిపరులను ఎక్కడికక్కడ నిలదీయగలగాలి. ప్రజాచైతన్యం రగిలితే అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరుగెడతాయి. అదే సమయంలో ప్రభుత్వాలు చట్టాలలోని లొసుగులను సవరించి, చట్టాలను లోపరహితంగా రూపొందించాలి. అవినీతిపరులకు కఠిన శిక్షలు విధించేలా చట్టాలను సవరించాలి. ప్రభుత్వ కార్యకలాపాలను వీలైనంతవరకూ ఆన్‌లైన్ విధానం ద్వారా నిర్వహిస్తే అవినీతికి ఆస్కారం ఉండదు. బొగ్గు గనులను వేలం వేసేందుకు ఆన్‌లైన్ విధానం తీసుకురావడం వల్ల ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం సమకూరిందన్న వాస్తవాన్ని విస్మరించకూడదు.

## మానవత్వానికి పట్టంగట్టిన మహనీయుడు



850 సంవత్సరాల క్రితమే ప్రజాస్వామ్య జ్యోతి ప్రగల్భింపజేసిన మహాత్ముడి కథ ఇది! అపూర్వ ప్రజాస్వామ్యవాది మహాత్మా బసవేశ్వరుడు, సమానత్వ జ్యోతిగా, సామాజిక న్యాయ గర్జనగా చరిత్ర పుటల్లో శాశ్వతంగా నిలిచిన సామాజిక విప్లవకారుడు, విశ్వగురు, మహా మానవతావాది, సంఘ సంస్కర్త. 12వ శతాబ్దంలో కుల, మత, వర్గ, వర్ణ వ్యవస్థలకు వ్యతిరేకంగా గళమెత్తి, స్త్రీ-పురుష అసమానతలను తొలగించడానికి కృషి చేసిన అభ్యుదయవాది. భారతదేశ మానవ హక్కుల చరిత్రలో తొలిపేజీని రాసిన గొప్ప మహనీయుడు, మానవ కల్యాణం కోసం స్వతంత్ర సమాలోచనలు చేసిన మొదటి వ్యక్తి, మూఢాచారాలను ధిక్కరించిన ధీరుడు, అనుభవ మంటపం ద్వారా ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటిన మార్గదర్శకుడు. 'దేహమే దేవాలయం,' 'చేసే పనే దైవం' వంటి సందేశాలతో మానవతా విలువలను ప్రపంచానికి ప్రసాదించారు. కుల, మత, లింగ, వర్గ భేదాలతో కూడిన సమాజంలో అసమానతలను సవాలు చేస్తూ,, ఆయన రగిలించిన సామాజిక సంస్కరణ జ్యోతి నేటికీ స్ఫూర్తినిస్తోంది. 1134లో కర్ణాటకలోని బాగవాడి గ్రామంలో శైవ బ్రాహ్మణ కుటుంబంలో మాదిరాజు, మాదాంబిక దంపతులకు జన్మించిన బసవన్న బాల్యంలోనే మూఢాచారాలను ప్రశ్నించాడు. ఎనిమిదో ఏట ఉపనయనం చేయాలన్న తండ్రి మాటను తిరస్కరించి, అక్క నాగాంబిక వద్ద గురుకులంలో వేద శాస్త్రాలు, పురాణాలు, సాహిత్యం, గణితం, సంగీతం వంటి విద్యలలో ప్రావీణ్యం సంపాదించాడు. బిజ్జల చక్రవర్తి కొలువులో చేరి, మేనమామ బలదేవర కుమార్తెను వివాహమాడి, ప్రధానమంత్రి పదవికి ఎదిగాడు. నీతి, నిబద్ధత, సమాజసేవల ద్వారా ధర్మ పరిపాలనను ముందుకు నడిపించాడు. 12వ శతాబ్దంలో బసవన్న స్థాపించిన అనుభవ మంటపం ప్రపంచ చరిత్రలో మొట్టమొదటి ప్రజాస్వామ్య వేదికగా నిలిచింది. కుల, మత, లింగ, వర్గ భేదాలకు అతీతంగా, స్త్రీలు, దళితులు సమానంగా చర్చల్లో పాల్గొన్నారు. 'ప్రతి మనిషి ఒక ఓటు' సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టారు. మహిళలు వేదాలు బోధించి, నిర్ణయ ప్రక్రియలో కీలక పాత్ర పోషించారు. ఇష్టలింగ ధారణ ద్వారా ఆధ్యాత్మిక సమానత్వాన్ని నెలకొల్పారు. అస్పృశ్యతను సవాలు చేసిన ఈ వేదిక నేటి పార్లమెంట్‌లకు స్ఫూర్తిగా నిలుస్తుంది. బసవేశ్వరుడు స్థాపించిన లింగాయత ధర్మం సమానత్వం, న్యాయానికి ప్రతీక. 'శ్రమే పూజ, కాయకమే కైలాసం' సిద్ధాంతంతో బాల్య వివాహాలు, సతీసహగమనం, నరబలి, పశుబలి వంటి మూఢాచారాలను నిర్మూలించారు. ఇష్టలింగ ధారణ ద్వారా ప్రతి భక్తుని స్వాతంత్ర్యాన్ని, కులాంతర వివాహాలను, దళితుల ఆలయ ప్రవేశాన్ని ప్రోత్సహించారు. 'పుట్టుకతో కాదు, కర్మతో గొప్పతనం' అంటూసమానత్వాన్ని బలపరిచారు. నిరాకార శివుడే సర్వేశ్వరుడని, శివతత్వ ప్రచారంతో లింగాయత ధర్మానికి బీజం వేశారు. శాఖాహారాన్ని స్వీకరించి, సహజ శివయోగాన్ని ప్రసరింపజేశారు. బసవేశ్వరుడు 64 లక్షలకు పైగా వచనాలు రాసినప్పటికీ, కొన్ని వేలు మాత్రమే లభ్యమవుతున్నాయి. 'కాయకమే కైలాసం', 'జ్ఞానమే గురువు' వంటి వచనాలు కుల వ్యవస్థను ఛేదించి, ప్రేమ, సమానత్వం, న్యాయ విలువలను వ్యాప్తి చేశాయి. ఈ వచనాలు మానవతా మార్గాన్ని చూపాయి, సమాజాన్ని సరిదిద్దాయి, ధర్మం అంటే నిజాయితీ అని బోధించాయి. అన్ని భాషలలో అనువదించి, ఈ వచనాలను నేటి తరానికి అందించాలి. తెలంగాణ ప్రభుత్వం బసవ జయంతిని అధికారికంగా జరుపుతూ, ట్యాంక్ బండ్‌పై విగ్రహం స్థాపించి, వీరశైవ లింగాయత కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు వీరశైవ లింగాయతుల సర్వతోముఖ అభివృద్ధి కోసం కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి, యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. బసవ చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చడం, బీసీ జాబితాలో వీరశైవ లింగాయతులను చేర్చడం కాంగ్రెస్ ప్రభుత్వ ఘనత. భారత ప్రభుత్వం పార్లమెంట్ ప్రాంగణంలో బసవేశ్వరుని విగ్రహాన్ని, 2006లో 5, 100 రూపాయల నాణాలను విడుదల చేసింది. డాక్టర్ నీరజపాటిల్ కృషితో లండన్‌లో ప్రధాని మోడీ గారి చేతుల మీదుగా విగ్రహం ఆవిష్కరించబడింది.



EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, Printed at M/S MARPU PUBLICATION,# /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15, NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.). Cell:9398156948,REG.RNI: APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com